# నవజ్యోతి

తెలుగు దినపత్రిక

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి: 01 సంచిక : 291 | ఎడిటర్.: మన్నే లక్ష్మణ్ | వెల:5/- | పేజీలు: 8 | బుధవారం 12-08-2026


## స్వాతంత్ర దినోత్సవ వేడుకల వేళ హైఅలర్ట్



- ఉగ్ర ముప్పుపై నిఘా సంస్థల హెచ్చరిక
- పాక్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కట్టుదిట్టమైన భద్రత

2

## చేవెళ్ల–శంకర్ పల్లి మార్గంలో ఆర్టీసీ బస్సుల కొరత...

- బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షణ.
- విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికుల అవస్థలు.




5



# పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన లక్ష్యం

## ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సన్నాహాలు వేగవంతం

- అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం ఆదేశం
- గత సమ్మిట్ ఫలితాలపై సమగ్ర నివేదిక కోరిన ముఖ్యమంత్రి
- ఆర్థికాభివృద్ధికి బాటలు వేయాలని ప్రభుత్వం లక్ష్యం

2

రాష్ట్రానికి మరిన్ని దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో డిసెంబర్‌లో నిర్వహించనున్న "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్" ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమ్మిట్‌ను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించి తెలంగాణను పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా ప్రపంచానికి చాటిచెప్పేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పెట్టుబడుల సేకరణలో రాష్ట్రం మరింత ముందంజలో నిలిచేలా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని సూచించారు.



## హర్ ఘర్ తిరంగా విజయవంతం చేయండి

- ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు
- ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరవేయాలి
- వందేమాతరం 150 ఏళ్లకు అంకితం

2

## నిరుపేద విద్యార్థులకు కేటీఆర్ చేయూత

- 'గిఫ్ట్ ఏ స్మైల్'లో ల్యాప్‌టాప్‌ల పంపిణీ
- రైతు కుటుంబాల విద్యార్థులకు ప్రోత్సాహం
- ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్ష

2

నిరుపేద కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా నిలుస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమం ద్వారా మరోసారి సహాయం అందించారు.





## పత్తి కొనుగోళ్లపై తుమ్మల కీలక ఆదేశాలు

- 15–30 రోజుల్లో అన్ని జిల్లాల్లో జిన్నింగ్ మిల్లుల ప్రారంభం
- పత్తి కొనుగోళ్లలో మధ్యవర్తులకు అవకాశం లేదన్న మంత్రి

2



# 3.43 కోట్ల లబ్ధిదారులకు ఆహార భద్రత రక్షణ

- ఆగస్టు 15న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం
- సంగారెడ్డిలో రాష్ట్రవ్యాప్త కార్యక్రమానికి సీఎం శ్రీకారం
- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఉత్తమ్ ఆదేశాలు

**రాష్ట్రవ్యాప్తంగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నట్లు పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.** తెలంగాణ ఆహార భద్రత వ్యవస్థను మరింత బలోపేతం చేసే కీలక కార్యక్రమంగా దీనిని అభివర్ణించిన మంత్రి, ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం అనంతరం రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో ఒకేసారి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టనున్నట్లు వెల్లడించారు.

హైదరాబాద్, ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి):

<రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారుల పండుగగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. మంగళవారం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రోహిత్ సింగ్‌తో పాటు ఇతర అధికారులతో సమావేశమై కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కూడా ప్రత్యేకంగా మాట్లాడి ఏర్పాట్ల పురోగతిని తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం

మిగతా 2 లో..

## పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలి

- ప్రధాని మోదీకి వీహెచ్ లేఖ
- జెండా రూపకర్తకు గౌరవం కోరుతూ విజ్ఞప్తి
- హర్ ఘర్ తిరంగా నేపథ్యంలో డిమాండ్
- తెలుగు మహనీయుడికి గుర్తింపు ఇవ్వాలన్న పిలుపు

2



## అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పుల్లేవు

చేయూత కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

2

## ఏడు ప్రాజెక్టులపై బీఆర్ఎస్ ఆందోళన



- ప్రాజెక్టుల అనుమతుల రద్దు అంగీకరించం
- జీఆర్ఎంబీ సమావేశం బహిష్కరించాలన్న కేటీఆర్
- తెలంగాణ హక్కుల కోసం పోరాటం హెచ్చరిక

2

## నిషేధిత భూములపై ఆందోళన అవసరం లేదు



- అర్హులందరికీ న్యాయం చేస్తాం: పొంగులేటి
- ఈనెల 14లోగా పత్రాలన్నీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్

2



## అమెరికా ఆంక్షలపై ఇరాన్ మండిపాటు

- ఆంక్షలు అమెరికాకు వ్యసనంగా మారాయి
- బెసెంట్ వ్యాఖ్యలకు ఘాటు ప్రతిస్పందన
- ఆర్థిక యుద్ధాన్ని తట్టుకున్న ఇరాన్

2

## 3.43 కోట్ల మంది లబ్ధిదారులకు ఆహార భద్రత రక్షణ

**మొదటిపేజీ తరువాయి**

కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. తెలంగాణలో ప్రస్తుతం సుమారు 1.06 కోట్ల ఆహార భద్రత కార్డులు ఉండగా, వాటి ద్వారా 3.43 కోట్ల మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందుతున్నారని మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. 2025 జనవరి 26 నుంచి ఇప్పటివరకు 16,32,810 కొత్త ఆహార భద్రత కార్డులు జారీ చేయగా, వాటి ద్వారా 61,08,544 మంది కొత్త లబ్ధిదారులు ఆహార భద్రత పరిధిలోకి వచ్చారని వెల్లడించారు. స్మార్ట్ రేషన్ కార్డుల ప్రవేశంతో ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం, సౌలభ్యం మరింత పెరుగుతుందని తెలిపారు. సంగారెడ్డిలో జరిగే ప్రధాన కార్యక్రమాన్ని భారీ బహిరంగ సభగా నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. లబ్ధిదారుల రాకపోకలు, కూర్చునే ఏర్పాట్లు, భద్రతా చర్యలు, కార్డుల పంపిణీ విధానం, ముఖ్యమంత్రి కార్యక్రమాల షెడ్యూల్ వంటి అన్ని అంశాలపై నిమిషానికో ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.35 గంటల మధ్య కార్యక్రమం పూర్తి కావాలని, అనంతరం ముఖ్యమంత్రి తదుపరి అధికారిక కార్యక్రమాలకు హాజరయ్యేలా సమయపాలన పాటించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులకు పూర్తి వివరాలతో అధికారిక ఆహ్వానాలు పంపాలని చెప్పారు. స్మార్ట్ రేషన్ కార్డులను ముఖ్యమంత్రి అందజేసే లబ్ధిదారులను అన్ని వర్గాల నుంచి ఎంపిక చేయాలని మంత్రి సూచించారు. నిర్దేశిత నమూనాలో లామినేషన్ చేసిన కార్డులను సిద్ధం చేసి పంపిణీ చేయాలని చెప్పారు. అనంతరం రేషన్ దుకాణాలు లేదా ఈ ప్రక్రియకు అనుబంధంగా ఉన్న గుర్తింపు పొందిన సంస్థల ద్వారా కార్డుల పంపిణీ చేపట్టాలని సూచించారు. లబ్ధిదారుల గుర్తింపును ధ్రువీకరించిన తర్వాతే కార్డులు అందజేయాలని, తద్వారా పారదర్శకత పెరగడంతో పాటు వివాదాలకు అవకాశం లేకుండా ఉంటుందని పేర్కొన్నారు.

## హర్ ఘర్ తిరంగా విజయవంతం చేయండి

**న్యూఢిల్లీ, ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి):**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని, 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రతి భారతీయుడు చురుకుగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని కోరారు. ''హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా'' అనే సందేశంతో దేశ ప్రజల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ప్రత్యేక రీల్‌ను పంచుకున్న ప్రధాని మోదీ, స్వాతంత్ర్య దినోత్సవాన్ని గర్వంగా, ఉత్సాహంగా జరుపుకోవాలని సూచించారు. దేశ అభివృద్ధి లక్ష్యమైన 'వికసిత్ భారత్' సాధనకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలని, ఈ సందర్భంగా దేశాభివృద్ధికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిలో త్రివర్ణ పతాకం రెపరెపలాడేలా చూడాలని, ఈ కార్యక్రమాన్ని జాతీయ వేడుకగా మార్చాలని కోరారు. ఇటీవల సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా కూడా ప్రధాని మోదీ ప్రజలను ఉద్దేశించి సందేశం ఇచ్చారు. త్రివర్ణ పతాకం కేవలం జెండా మాత్రమే కాదని, అది దేశ గౌరవానికి, ఐక్యతకు, సార్వభౌమాధికారానికి ప్రతీక అని పేర్కొన్నారు. దేశం కోసం అత్యుత్తమంగా సేవ చేయాలనే స్ఫూర్తిని జాతీయ పతాకం ప్రతి భారతీయుడిలో నింపుతుందని తెలిపారు. దేశభక్తి భావనను మరింత బలపరచడంలో 'హర్ ఘర్ తిరంగా' కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ ఏడాది నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' గీతం 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని వెల్లడించారు.

## అమెరికా ఆంక్షలపై ఇరాన్ మండిపాటు

**టెహ్రాన్, ఆగస్టు 11(నవజ్యోతి ప్రతినిధి) :**

ప్రపంచ దేశాలపై, ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా విధిస్తున్న ఆర్థిక ఆంక్షలు ఇప్పుడు ఒక అలవాటుగా, చివరకు వ్యసనంగా మారిపోయాయని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ తీవ్ర విమర్శలు చేశారు. ఇరాన్‌ను ఆర్థికంగా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నామని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ చేసిన వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమం ద్వారా స్పందించిన ఆయన, దౌత్యపరంగా లక్ష్యాలను సాధించడంలో విఫలమైనప్పుడల్లా అమెరికా ఆంక్షల మార్గాన్ని ఎంచుకుంటోందని ఆరోపించారు. ఆంక్షలు ఫలితం ఇవ్వకపోయినా వాటి తీవ్రతను పెంచుతూ తన వైఫల్యాలను దాచిపెట్టేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని బఘాయీ పేర్కొన్నారు. దశాబ్దాలుగా కఠిన ఆంక్షలను ఎదుర్కొంటున్న ఇరాన్ ప్రజలు ఎన్నో సవాళ్లను అధిగమించారని, కేవలం ఆర్థిక ఒత్తిడితో తమ దేశాన్ని లొంగదీసుకోవడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. బెదిరింపులు, ఆంక్షలు ఇరాన్ సంకల్పాన్ని బలహీనపరచలేవని వ్యాఖ్యానించారు. అమెరికా నాయకత్వం ఈ విధానాన్ని కొనసాగిస్తే భవిష్యత్తులో దౌత్యపరమైన పరిష్కారాలకు తలుపులు మూసుకుపోయే ప్రమాదం ఉందని ఇరాన్ హెచ్చరించింది. గౌరవప్రదమైన చర్చలు, పరస్పర అవగాహన ద్వారానే అంతర్జాతీయ సమస్యలకు పరిష్కారం సాధ్యమని పేర్కొంది. ఆంక్షల రాజకీయాలు ప్రపంచ శాంతి, స్థిరత్వానికి మేలు చేయవని అభిప్రాయపడింది. ఇదిలా ఉండగా, ఇరాన్ ప్రభుత్వం ఆంక్షలను తప్పించుకునేందుకు డిజిటల్ ఆస్తులు, రహస్య బ్యాంకింగ్ వ్యవస్థలను వినియోగిస్తోందని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ ఆరోపించారు. ఇరాన్‌కు సంబంధించిన అక్రమ ఆర్థిక నెట్‌వర్క్‌లను గుర్తించి వాటిని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ అంశంపై అమెరికా–ఇరాన్ మధ్య మాటల యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చుతోంది.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకల వేళ హైఅలర్ట్

**న్యూఢిల్లీ, ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి):**

స్వాతంత్ర దినోత్సవ వేడుకల నేపథ్యంలో దేశంలో ఉగ్రవాద దాడుల ముప్పు పొంచి ఉందని నిఘా సంస్థలు హెచ్చరించడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ మద్దతుతో ఉగ్రవాద సంస్థలు సరిహద్దుల వద్ద లేదా దేశంలోని ఇతర ప్రాంతాల్లో దాడులకు పాల్పడే అవకాశం ఉందన్న సమాచారంతో భద్రతా బలగాలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. ముఖ్యంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తూ కేంద్రం కీలక చర్యలు చేపట్టింది. ఆగస్టు 15న ఢిల్లీలోని ఎర్రకోటతో పాటు జమ్మూకాశ్మీర్‌లో జరిగే కార్యక్రమాలపై భద్రతా బలగాల దృష్టి కేంద్రీకృతమై ఉంటుందని, ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని ఉగ్రవాదులు దాడులకు యత్నించే అవకాశముందని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్, బలూచిస్థాన్‌లో నెలకొన్న అంతర్గత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి కుట్రలకు పాల్పడుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. జమ్మూకాశ్మీర్‌లోకి ఉగ్రవాదుల చొరబాట్లు, బంగ్లాదేశ్ సరిహద్దుల ద్వారా అక్రమ ప్రవేశాలు జరగవచ్చని హెచ్చరికలు జారీ అయ్యాయి. అంతేకాకుండా భద్రతా ఏర్పాట్లు తక్కువగా ఉండే ద్వితీయ శ్రేణి నగరాలను లక్ష్యంగా చేసుకునే ప్రమాదం కూడా ఉందని నిఘా సంస్థలు పేర్కొన్నాయి. కొన్నిసార్లు భద్రతా సంస్థల దృష్టిని ఒక ప్రాంతంపై మళ్లించి, మరో ప్రాంతంలో దాడులకు పాల్పడే వ్యూహాన్ని కూడా ఉగ్రవాద సంస్థలు అనుసరించే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌తో ఉన్న పశ్చిమ సరిహద్దు వెంట సరిహద్దు భద్రతా దళం ప్రత్యేక నిఘా చర్యలను ప్రారంభించింది. ఆగస్టు 10 నుంచి 17 వరకు కొనసాగే "ఆపరేషన్ అలర్ట్"లో భాగంగా సరిహద్దు ప్రాంతాల్లో పెట్రోలింగ్, తనిఖీలు, నిఘాను గణనీయంగా పెంచారు. సీనియర్ అధికారులు స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తూ ప్రతి అనుమానాస్పద కదలికపై నిశితంగా నిఘా ఉంచుతున్నారు.

# పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన లక్ష్యం

**హైదరాబాద్, ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి):**

సమ్మిట్ ద్వారా కొత్త పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, ఆర్థికాభివృద్ధికి బాటలు వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సమ్మిట్ ఏర్పాట్లు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపార రంగ ప్రముఖులను ఆకర్షించే విధంగా కార్యక్రమ రూపకల్పన చేయాలని చెప్పారు. తెలంగాణలో ఉన్న పరిశ్రమల అనుకూల వాతావరణం, మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులను సమ్మిట్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించాలని సూచించారు. పెట్టుబడిదారులకు రాష్ట్ర సామర్థ్యాలను సమగ్రంగా వివరించేలా ప్రత్యేక ప్రదర్శనలు, చర్చా వేదికలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యాపార రంగంలోని వివిధ విభాగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులను సమ్మిట్ వేదికగా సన్మానించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. పారిశ్రామిక రంగంలో విశేష కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు గుర్తింపు ఇవ్వడం ద్వారా తెలంగాణ పెట్టుబడి వాతావరణంపై సానుకూల సందేశం వెళ్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి దోహదపడుతున్న రంగాలను ప్రోత్సహించేందుకు సమ్మిట్‌ను సమర్థవంతమైన వేదికగా ఉపయోగించుకోవాలని చెప్పారు. ప్రపంచ స్థాయి సంస్థల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత ఏడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, వాటి అమలు పురోగతి, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై పూర్తి వివరాలను సమర్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కుదిరిన ఒప్పందాలు ఎంత మేరకు అమలయ్యాయి, ఎన్ని పరిశ్రమలు కార్యకలాపాలు ప్రారంభించాయి, ఎన్ని ఉద్యోగాలు సృష్టించబడ్డాయి అనే అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని చెప్పారు. పెట్టుబడుల వాస్తవ పురోగతిని విశ్లేషించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు ప్రజలకు ఎంత మేర ప్రయోజనం చేకూర్చాయో కూడా అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల వృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన కొత్త వ్యూహాలను రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలు, సాంకేతిక రంగాలు, తయారీ రంగం, సేవల రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేలా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

## పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలి

**హైదరాబాద్, ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి):**

భారత జాతీయ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమర యోధుడు పింగళి వెంకయ్యకు దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న' ప్రకటించాలని తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు, కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి బహిరంగ లేఖ రాసి, దేశ గౌరవానికి ప్రతీకగా నిలిచిన త్రివర్ణ పతాకాన్ని రూపొందించిన మహనీయుడికి తగిన గుర్తింపు కల్పించాలని కోరారు. త్రివర్ణ పతాకం కోట్లాది భారతీయుల గుండెల్లో దేశభక్తిని నింపుతున్న జాతీయ చిహ్నమని వీహెచ్ పేర్కొన్నారు. అలాంటి పతాకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్య సేవలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. దేశానికి చేసిన అపార సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఇవ్వగల అత్యున్నత గౌరవం భారతరత్న మాత్రమేనని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని స్వాగతిస్తున్నట్లు వీహెచ్ తెలిపారు. అయితే జాతీయ జెండా రూపకర్తకు ఇప్పటివరకు భారతరత్న ప్రకటించకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. దేశమంతటా జాతీయ పతాకం ఎగురవేస్తూ వేడుకలు నిర్వహిస్తున్న సమయంలో దాని సృష్టికర్తకు తగిన గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు నేలపై జన్మించిన పింగళి వెంకయ్య దేశానికి అందించిన సేవలు అమూల్యమైనవని వీహెచ్ పేర్కొన్నారు. ఆయన త్యాగాలు, దేశభక్తి భావం నేటి తరాలకు ఆదర్శమని చెప్పారు. స్వాతంత్ర్య సమరంలో ఆయన పోషించిన పాత్రను మరింత విస్తృతంగా ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. పింగళి వెంకయ్యకు భారతరత్న ప్రకటించడం ద్వారా స్వాతంత్ర్య సమరయోధులందరికీ గౌరవం చెల్లించినట్లవుతుందని వీహెచ్ అభిప్రాయపడ్డారు. ఇది కేవలం ఒక వ్యక్తికి ఇచ్చే పురస్కారం మాత్రమే కాకుండా, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన తరాలకు ఇచ్చే గుర్తింపుగా నిలుస్తుందని చెప్పారు. దేశ ప్రజల భావోద్వేగాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని కోరారు. గతంలో హైదరాబాద్‌లో పింగళి వెంకయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని వీహెచ్ గుర్తు చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పింగళి వెంకయ్యకు భారతరత్న ప్రకటించాలని తన లేఖలో విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. తెలుగు ప్రజలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న దేశభక్తుల ఆకాంక్షను నెరవేర్చే దిశగా కేంద్రం నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

## నిరుపేద విద్యార్థులకు కేటీఆర్ చేయూత

**హైదరాబాద్, ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి):**

ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ఇద్దరు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందజేసి వారి విద్యాభ్యాసానికి ప్రోత్సాహం కల్పించారు. విద్య ద్వారా జీవితాలను మార్చుకునే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచించారు. మిర్యాలగూడ సమీపంలోని పెద్దతండాకు చెందిన రైతు కుమారుడు జీవన్ ఇటీవల ఐఐటీ ఖరగ్‌పూర్‌లో బయోటెక్నాలజీ కోర్సులో సీటు సాధించాడు. అలాగే వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటకు చెందిన రైతు కుమార్తె ఫర్జానా సివిల్స్ పరీక్షలకు సన్నద్ధమవుతూ కోచింగ్ తీసుకుంటోంది. ఈ ఇద్దరి విద్యా ప్రస్థానాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో కేటీఆర్ వారికి ల్యాప్‌టాప్‌లను అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన కేటీఆర్, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు కష్టపడి చదివి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం గర్వకారణమన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమిస్తున్న యువతకు సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రతిభకు అవకాశాలు కల్పిస్తే మరెంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటారని చెప్పారు. జీవన్ ఐఐటీలో ఉన్నత విద్యను అభ్యసిస్తూ పరిశోధన రంగంలో రాణించాలని, ఫర్జానా సివిల్ సర్వీసుల్లో విజయం సాధించి ప్రజాసేవలో నిలదొక్కుకోవాలని కేటీఆర్ ఆకాంక్షించారు. వారి విజయాలు కుటుంబాలకు మాత్రమే కాకుండా గ్రామాలకు, సమాజానికి కూడా గర్వకారణంగా నిలవాలని అన్నారు. విద్యార్థుల పట్టుదల ఇతరులకు స్ఫూర్తిగా మారాలని సూచించారు. 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమం ద్వారా అవసరమైన విద్యార్థులను గుర్తించి వారికి సహాయం అందించడం కొనసాగుతున్నట్లు తెలిపారు.

## ఏడు ప్రాజెక్టులపై బీఆర్ఎస్ ఆందోళన

**హైదరాబాద్, ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణకు సంబంధించిన ఏడు సాగునీటి ప్రాజెక్టుల అనుమతుల రద్దు అంశాన్ని జీఆర్ఎంబీ సమావేశ అజెండాలో చేర్చడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం గతంలో సాధించిన అనుమతులను ఇప్పుడు రద్దు చేసే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంగా ప్రకటించి, అవసరమైతే జీఆర్ఎంబీ సమావేశాన్ని బహిష్కరించాలని డిమాండ్ చేశారు. మీడియాతో మాట్లాడిన కేటీఆర్, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో కాళేశ్వరం, సీతారామ, పాలమూరు–రంగారెడ్డి వంటి కీలక ప్రాజెక్టులతో పాటు మరికొన్ని సాగునీటి పథకాలకు అనుమతులు సాధించామని గుర్తు చేశారు. ఆ అనుమతులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చినవేనని పేర్కొంటూ, ఇప్పుడు వాటినే రద్దు చేయాలన్న డిమాండ్లను అజెండాలో చేర్చడం ఆశ్చర్యకరమని అన్నారు. తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల ఆధారంగా సాగిందని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రతి నీటి బొట్టును వినియోగించుకునేలా అనేక ప్రాజెక్టులను చేపట్టి బీడు భూములను సాగుభూములుగా మార్చే ప్రయత్నం చేశామని తెలిపారు. మిషన్ కాకతీయతో పాటు అనేక నీటి వనరుల అభివృద్ధి కార్యక్రమాల ద్వారా తెలంగాణ రైతాంగానికి ప్రయోజనం చేకూర్చామని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ ప్రాజెక్టుల అనుమతుల రద్దు కోరడం సరికాదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. గతంలో ఏపీ చేపట్టిన పోలవరం, పట్టిసీమ వంటి ప్రాజెక్టుల విషయంలో తెలంగాణ ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని చెప్పారు. అదే విధంగా తెలంగాణకు ఇప్పటికే లభించిన అనుమతులను కూడా గౌరవించాలని సూచించారు. రెండు రాష్ట్రాలు పరస్పర సహకారంతో నీటి వనరులను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. జీఆర్ఎంబీ సమావేశ అజెండాలోని ఈ అంశాలను తొలగించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపట్టాల్సి వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

## అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పుల్లేవు

**హైదరాబాద్, ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి):**

అర్హులైన పేదలు, బలహీన వర్గాలకు సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేయూత సామాజిక భద్రత పింఛన్ పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు చర్యలు చేపట్టింది. తొలి దశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న అర్హులకు కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. కొత్త పింఛన్ల కోసం అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పులు చేయలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత ప్రభుత్వాల హయాంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న నిబంధనలనే ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. పింఛన్ల మంజూరు ప్రక్రియ చేపట్టనున్నారు. ప్రజాపాలన వారోత్సవాలు, 99 రోజుల ప్రగతి ప్రణాళిక గ్రామసభలు, ప్రజావాణి కార్యక్రమాల్లో ఇప్పటికే అందిన దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు.

## నిషేధిత భూములపై ఆందోళన అవసరం లేదు

**హైదరాబాద్, ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి):**

నిషేధిత ఆస్తుల పీఓబీ, 22ఏ జాబితాల్లో ఉన్న భూములకు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలు, ఆందోళనలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని, గతంలో ఏర్పడిన సాంకేతిక, చట్టపరమైన సమస్యలను పరిష్కరించి బాధితులకు ఊరట కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. కొత్తగా ఎలాంటి భూములను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చలేదని, గత ప్రభుత్వ కాలం నుంచి కొనసాగుతున్న సమస్యలను పారదర్శకంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ఇప్పటివరకు ప్రభుత్వం జారీ చేసిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రక్రియలు, లేఅవుట్ అనుమతులు తదితర అన్ని పత్రాలను ఈనెల 14వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ ప్రక్రియ ద్వారా నకిలీ పత్రాలకు అడ్డుకట్ట పడటంతో పాటు అసలైన పత్రాలను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని చెప్పారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఏది నిజమైన పత్రం, ఏది బోగస్ పత్రం అన్న విషయాన్ని అధికారులు సులభంగా నిర్ధారించగలరని తెలిపారు. మరింత పారదర్శకత కోసం పహాణీ వివరాలను కూడా సబ్ రిజిస్ట్రార్లకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

## పత్తి కొనుగోళ్లపై తుమ్మల కీలక ఆదేశాలు

**హైదరాబాద్, ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి):**

రాష్ట్రంలో రానున్న 2026–27 పత్తి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పత్తి కొనుగోళ్లను సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో సీసీఐ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కొనుగోలు ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. రైతులకు మార్కెటింగ్ దశలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన మంత్రి, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి ప్రతి రైతుకు కనీస మద్దతు ధర ప్రయోజనం అందేలా చూడాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో సుమారు 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతుందని, 25.85 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. లాంగ్ స్టేపుల్ కాటన్‌కు కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.8,667 మద్దతు ధర ప్రకటించిందని, గత ఏడాదితో పోలిస్తే రూ.557 పెరిగిందని వెల్లడించారు. పత్తి కొనుగోలు ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యానికి తావు లేకుండా రైతుల నుంచే నేరుగా కొనుగోళ్లు జరగాలని మంత్రి ఆదేశించారు. గత సీజన్లలో గుర్తించిన లోపాలను పరిగణనలోకి తీసుకుని ఈసారి అవకతవకలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని 356 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేసి, అవసరానికి అనుగుణంగా అన్ని కేటగిరీల మిల్లులను ఒకేసారి ప్రారంభించేలా ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. గత సీజన్‌లో 122 సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఉండగా, ఈసారి వాటి సంఖ్యను 131కు పెంచినట్లు మంత్రి తెలిపారు.

# ట్రాన్స్‌ఫార్మర్లపై వరుస దాడులు.. కాపర్ కోసమే టార్గెట్

- ఏడు ట్రాన్స్‌ఫార్మర్లపై దాడి.. నాలుగు ధ్వంసం చేసి వైర్లు చోరీ..
- వరుస చోరీలతో అధికారులకు సవాళ్లు విసురుతున్న దొంగలు ...





**భిక్కనూరు, కామారెడ్డి ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి):**

భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లిలో సోమవారం అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు రెచ్చిపోయారు. ఏడు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించగా నాలుగింటిని ధ్వంసం చేసి కాపర్ వైర్లు ఎత్తుకెళ్లారు. మిగతా మూడు ట్రాన్స్‌ఫార్మర్లలో అల్యూమినియం ఉండటంతో వాటిని వదిలేసినట్లు టీజీ ఎస్పీడీసీఎల్ ఏఈ బాలాజీ తెలిపారు. కేతి రాములు, బాల్‌రెడ్డి, పెద్దోళ్ల అమృతరెడ్డి, పెద్దోళ్ల రమేష్‌రెడ్డితో పాటు పలువురు రైతులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. దీంతో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలోనూ గురజకుంట, బస్వాపూర్, రాగట్లపల్లి, పెద్ద మల్లారెడ్డి ప్రాంతాల్లో 20కిపైగా ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు జరిగాయి. గురజకుంటలో కాపర్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, అల్యూమినియం ఉన్న వాటిని వదిలేసిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. దీంతో వరుస ఘటనల వెనుక ఒకే ముఠా ఉందా? కాపర్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలు దొంగలకు ముందుగానే ఎలా తెలుస్తున్నాయి? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమైనప్పుడు విద్యుత్ వ్యవస్థ ట్రిప్ అయ్యే అవకాశం ఉన్నప్పటికీ ఈ ఘటనలో ఎందుకు ట్రిప్ కాలేదన్న అంశంపైనా దర్యాప్తు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రైతులు, గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భిక్కనూరు ఎస్సై అనిల్ విజ్ఞప్తి చేశారు. పొలాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కొత్తగా కనిపించే వ్యక్తులు, అనుమానాస్పద వాహనాల కదలికలను గమనించాలని సూచించారు. రాత్రి వేళల్లో పొలాల వైపు ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రైతులు వీలైనంత వరకు తమ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తూ, యాంటీ థెఫ్ట్ లాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవడంతోపాటు వీలైనచోట వెల్డింగ్ చేయించి భద్రత కల్పించుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను రైతులు స్వయంగా అడ్డుకోవద్దని, వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై అనిల్ తెలిపారు. చోరీ చేసిన కాపర్ వైర్లు, కాయిల్స్ ఎక్కడ విక్రయిస్తున్నారు? వాటిని కొనుగోలు చేస్తున్న స్క్రాప్ వ్యాపారులు ఎవరు? అన్న కోణంలోనూ నిఘా పెంచాల్సిన అవసరం ఉంది. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నామని ఏఈ బాలాజీ తెలిపారు. విద్యుత్ శాఖ సిబ్బంది ప్రమేయానికి ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. వరుస చోరీలకు పాల్పడుతున్న దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# 12వ తేదీ వచ్చినా.. రేషన్ బియ్యం కోసం ఎదురుచూపులే!

- పలు గ్రామాలకు ఇంకా చేరని స్టాక్.. మండల కేంద్రాలకు వస్తున్న లబ్ధిదారులు..

**భిక్కనూరు, ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి):**

నెల మొదటి తేదీ దాటి 12వ తేదీ వచ్చినా భిక్కనూరు మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ బియ్యం పంపిణీ పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. గోదాముల నుంచి స్టాక్ పూర్తిగా చేరకపోవడంతో లబ్ధిదారులు బియ్యం కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. గుర్జకుంట, ర్యాగట్లపల్లి, జంగంపల్లి తదితర గ్రామాలకు ఇప్పటివరకు బియ్యం కోటా చేరలేదు. దీంతో ఆయా గ్రామాల లబ్ధిదారులు భిక్కనూరు మండల కేంద్రానికి వచ్చి బియ్యం కోసం అడుగుతున్నారు.

**మూడు నెలల కోటా.. విడతల వారీగా సరఫరా**

ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలకు సంబంధించిన మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే భిక్కనూరుకు మూడు నెలలకు సంబంధించిన మొత్తం కోటా ఇంకా చేరలేదు. కొంత స్టాక్ మాత్రమే రావడంతో అందుబాటులో ఉన్న మేరకు పంపిణీ కొనసాగుతోంది. మూడు నెలల సరఫరా కావడంతో బియ్యం విడతలవారీగా రేషన్ దుకాణాలకు చేరుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.



**డీలర్లకు తప్పని తిప్పలు**

గ్రామాల్లో బియ్యం అందుబాటులో లేకపోవడంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు వచ్చి అడుగుతున్నారు. తమకు కూడా పూర్తి స్థాయిలో స్టాక్ రాకపోవడంతో డీలర్లు సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడుతున్నారు. సరఫరా ఎప్పుడు పూర్తవుతుందో స్పష్టత లేకపోవడంతో ప్రతిరోజూ లబ్ధిదారులకు పరిస్థితిని వివరించాల్సి వస్తోందని డీలర్లు పేర్కొంటున్నారు.

**డీలర్ల వివరణ**

గుర్జకుంట, ర్యాగట్లపల్లి, జంగంపల్లి తదితర గ్రామాలకు బియ్యం కోటా చేరలేదని, భిక్కనూరుకు కూడా మూడు నెల ల మొత్తం కోటా ఇంకా రాలేదని డీలర్లు తెలిపారు. స్టాక్ పూర్తిగా చేరిన వెంటనే అందరికీ బియ్యం పంపిణీ చేస్తామని చెప్పారు.

**"డీసీఎస్ఓ వెంకటేశ్వర్లు మాటల్లో"**

మూడు నెలల సరఫరా కావడంతో బియ్యం విడతలవారీగా వస్తున్నాయని డీసీఎస్ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. అన్ని ప్రాంతాలకు సరఫరా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని, లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. స్టాక్ చేరిన వెంటనే రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తామని చెప్పారు.

# రైలులో గంజాయి కలకలం.. 6 కిలోలు స్వాధీనం

- కామారెడ్డి రైల్వే స్టేషన్ లో సంయుక్త తనిఖీలు..
- తప్పించుకున్న నిందితుల కోసం గాలింపు




**కామారెడ్డి, ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి):**

రైలులో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్, జిల్లా టాస్క్‌ఫోర్స్, రైల్వే పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. సికింద్రాబాద్ నుంచి నాందేడ్ వెళ్తున్న నాగావళి ఎక్స్‌ప్రెస్‌లో చేపట్టిన తనిఖీల్లో సుమారు 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అయితే గంజాయిని తరలిస్తున్న నిందితులు పట్టుబడకుండా తప్పించుకున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, కామారెడ్డి జిల్లా మద్య నిషేధ అధికారి ముకుందరెడ్డి ఆదేశాలతో అధికారులు తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది, డీటీఎఫ్, రైల్వే పోలీసులు అప్రమత్తమయ్యారు. రైలులో తనిఖీలు చేయగా దాచిపెట్టిన సుమారు 6 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

**తప్పించుకున్న నిందితుల కోసం గాలింపు**

గంజాయి స్వాధీనం చేసుకున్నప్పటికీ దానిని తరలిస్తున్న వ్యక్తులు మాత్రం అధికారులకు చిక్కలేదు. గంజాయి ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు రైలులో తీసుకొచ్చారు? ఎక్కడికి తరలిస్తున్నారు? అన్న కోణాల్లో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు రైల్వే స్టేషన్, రైలు పరిసరాల్లోని కదలికలు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలిస్తున్నారు.

**రైళ్లపై మరింత నిఘా**

రైళ్ల ద్వారా మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని అధికారులు తెలిపారు. కామారెడ్డి మీదుగా వెళ్లే రైళ్లలో ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, రైల్వే పోలీసులు సమన్వయంతో నిఘా కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో కామారెడ్డి ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ, డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుందర్ కృష్ణన్, ఎస్ఐలు విక్రమ్‌కుమార్, శ్రీనివాసరావు, శరత్‌కుమార్, ట్రైనీ ఎస్ఐలు అనిల్, మధుతో పాటు జాన్, షరీఫ్, అమృత్‌రెడ్డి, శంకర్, పవన్, సర్మిల, శరత్, దినేష్, రాజు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# చింతా వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల ఫైర్

**అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?.. ఎమ్మెల్యేకు సవాల్**

**సంగారెడ్డి, ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి) :**



సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా స్పందించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిపై విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధితో పాటు తాము లేవనెత్తుతున్న అంశాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ చింతా ప్రభాకర్ కు సవాల్ విసిరారు. 2017లో సంగారెడ్డిలో నిర్వహించిన రాహుల్ గాంధీ సభ విజయవంతమైన తర్వాత జగ్గారెడ్డిపై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడిందన్న వ్యాఖ్యలకు చింతా ప్రభాకర్ ఇచ్చిన కౌంటర్ నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతా ప్రభాకర్ కుటుంబానికి సంబంధించిన భూముల వ్యవహారాలపై పలు ఆరోపణలు చేశారు. సీలింగ్ భూముల రిజిస్ట్రేషన్, దళితుల భూములు, సదాశివపేటలో రోడ్లు, మాలకుంటకు సంబంధించిన అంశాలపై ఎమ్మెల్యే ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై సదాశివపేటలో ఎక్కడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధమని ప్రకటించారు. సంగారెడ్డి అభివృద్ధికి జగ్గారెడ్డి చేసిన కృషిని ప్రజలు గుర్తించారని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ఐఐటీ ఏర్పాటు, ఇంటింటికీ మంజీరా నీరు, సంగారెడ్డి–లింగంపల్లి నాలుగు లేన్ల రహదారి, ప్రభుత్వ పాలిటెక్నిక్, అగ్రికల్చర్, పీజీ కళాశాలల ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాల్లో జగ్గారెడ్డి కీలక పాత్ర పోషించారని తెలిపారు. కరోనా సమయంలో ప్రజలకు ఆక్సిజన్ సిలిండర్లు అందించి అండగా నిలిచారని గుర్తుచేశారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉండే నాయకుడు జగ్గారెడ్డి అని పేర్కొన్నారు. ఇకపై బీఆర్ఎస్ నేతల అవినీతికి సంబంధించిన అంశాలను ఒక్కొక్కటిగా ప్రజల ముందుకు తీసుకొస్తామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్ , సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మునిపల్లె సత్యనారాయణ, కూన సంతోష్, షఫీ హఫీజ్, కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భిక్నూర్ లో ఘనంగా సుభాష్ రెడ్డి జన్మదిన వేడుకలు

- ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, ఓఆర్ ఎస్ ప్యాకెట్ల పంపిణీ.. కేక్ కట్ చేసిన ఎస్ .ఆర్. ఫౌండేషన్ సభ్యులు...



**భిక్నూర్ , ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి):**

ప్రముఖ వ్యాపారవేత్త, విద్యాదాత, ఎస్ .ఆర్ . ఫౌండేషన్ చైర్మన్ తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి జన్మదిన వేడుకలను భిక్నూర్ మండలంలో ఘనంగా నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకుని ఎస్ .ఆర్ . ఫౌండేషన్ ఆధ్వర్యంలో భిక్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, ఓఆర్ ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం భిక్నూర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి సుభాష్ రెడ్డికి సభ్యులు, అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవే లక్ష్యంగా ఆయన ముందుకు సాగుతున్నారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని సభ్యులు పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై సేవా కార్యక్రమాలతో జన్మదిన వేడుకలు నిర్వహించడం అభినందనీయమని పలువురు అన్నారు. భవిష్యత్ లోనూ ప్రజా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని ఎస్ .ఆర్ . ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, సుభాష్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి ఇద్దరు దొంగల హల్చల్ తిరుమల వైన్ షాప్ లో చోరీ....

- షట్టర్ తాళాలు పగులగొట్టి రూ.10 వేల నగదు అపహరణ
- ఇద్దరు నిందితుల కోసం గాలింపు : ఎస్ఐ సుభాష్ గౌడ్






**మనోహరబాద్, 11 ఆగష్టు ( నవజ్యోతి ప్రతినిధి నవీన్ ):**

మానోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిరుమల వైన్ షాప్‌లో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వైన్స్ షాప్ వద్ద ఎవరు లేరని గ్రహించిన దొంగలు ఆగస్టు 9న అర్ధరాత్రి 2 గంటలకు తాళాలు పగలగొట్టిన దొంగలు వేసి ఇంటికి వెళ్లారు. ఆగస్టు 10న తెల్లవారుజామున 3 గంటల సమయంలో వాచ్‌మన్ షాప్ వద్దకు వెళ్లగా షట్టర్లు తెరిచి ఉండటాన్ని గుర్తించి యజమానికి సమాచారం అందించాడు. షాప్‌ను పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తులు షట్టర్ తాళాలను పగులగొట్టి క్యాష్ కౌంటర్‌లోనీ రూ.10,000 వేల నగదును చోరీ చేసినట్లు సీసీ టీవీ కెమెరాలలో చోరీ దృశ్యాలను గుర్తించిన పోలీసులు,వైన్స్ యజమాని ఫిర్యాదు మేరకు మానోహరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపారు.

## సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి వైభవంగా 'మారు బోనం' సమర్పణ



**సికింద్రాబాద్, ఆగస్టు11 (నవజ్యోతి బ్యూరో చీఫ్ టి రాజగోపాల్) :**

సికింద్రాబాద్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో మారు బోనం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. బోనాల పండుగ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే ఈ వేడుకకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ విశేష కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకున్న ఆమె, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో మారు బోనాన్ని ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు. ఈ వేడుకలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆలయ ఈవో గుత్తా మనోహర్ రెడ్డి, మరియు జోగినీలు పాల్గొన్నారు. డోలు వాయిద్యాలు, మంగళ వాయిద్యాల మోతలు, భక్తుల కోలాహలం మరియు ఆధ్యాత్మిక వాతావరణం మధ్య అమ్మవారికి బోనాన్ని అత్యంత భక్తిప్రపత్తులతో సమర్పించారు.

## రాజీవ్ రహదారి బాధితులకు బీజేపీ అండ: రామచంద్రరావు

**హైదరాబాద్ ఆగస్టు 11 (నవజ్యోతి బ్యూరో చీఫ్ టి రాజగోపాల్)**



రాజీవ్ రహదారి పొడవునా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కారణంగా ఇరువైపులా తమ యాజమాన్య హక్కులను కోల్పోతున్న బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కార్ఖానా వద్ద సతీష్ గుప్తా ఆధ్వర్యంలో బాధితులు ఒక నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు హాజరై, బాధితులకు తమ పార్టీ పూర్తి సంఘీభావం ప్రకటిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంతో ప్రాంతీయ అభివృద్ధిని తాము కోరుకుంటున్నామని, అయితే అదే సమయంలో కార్ఖానా నుండి అల్వాల్ వరకు తమ హక్కులను, ఆస్తులను కోల్పోతున్న బాధితులకు ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని ఆయన స్పష్టం చేశారు.

## ఎంఎస్ఎంఈ లకు మరింత బలం: శివ శేషగిరిరావు



**బాలానగర్ ఆగస్టు 11 (నవజ్యోతి బ్యూరో చీఫ్ టి రాజగోపాల్):**

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి చట్టం–2026 సవరణలతో MSME రంగానికి మరింత బలమైన, చట్టపరమైన వ్యవస్థ అందుబాటులోకి రానుందని MSME–DFO జాయింట్ డైరెక్టర్ (JD) సి. శివ శేషగిరిరావు తెలిపారు. పెట్టుబడి మరియు టర్నోవర్ ఆధారంగా MSME వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంతో పాటు, ఉద్యామ్ రిజిస్ట్రేషన్‌కు శాశ్వత ప్రాతిపదిక కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. దీనివల్ల ఈ రంగానికి మరింత ప్రయోజనం చేకూరుతుందని అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యామ్‌లో నమోదైన MSMEల సంఖ్య 2023 ఏప్రిల్‌లో 1.65 కోట్లుగా ఉండగా, అది ప్రస్తుతం 9.16 కోట్లకు పెరిగిందని ఆయన మీడియాకు వివరించారు.

## అమ్మవారి సన్నిధిలో..అన్నదాన సందడి

### అమ్మవారి సన్నిధిలో వారాల వినోద్ కుమార్ ప్రత్యేక పూజలు



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 11: (నవజ్యోతి ప్రతినిధి)**

బోనాల పండుగ సందర్భంగా సాయిబాబా నగర్ డివిజన్లోని తెలుగు తల్లి నగర్ నల్లపోచమ్మ ఆలయంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేసి, ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా వారాల వినోద్ కుమార్ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

**భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం**

బోనాల పండుగ నేపథ్యంలో ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మహిళలు, బస్తీవాసులు ఉత్సాహంగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు తల్లి నగర్ అధ్యక్షులు తారాసింగ్, కరాటే శీను, శ్యామ్, నిరంజన్ ముదిరాజ్, రాధాకృష్ణతో పాటు బీఆర్ఎస్ నాయకులు రాజ్‌కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పరికిబండ లో ఘనంగా రేణుకఎల్లమ్మ బోనాల పండుగ ఉత్సవాలు

### అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన : సర్పంచ్ మోతీబాయి లక్ష్మణ్ సింగ్....



**మనోహరబాద్, 11 ఆగష్టు (నవజ్యోతి ప్రతినిధి నవీన్) :**

మనోహరాబాద్ మండలం పరికిబండ గ్రామంలో ఆషాడ బోనాల మహోత్సవం పురస్కరించుకొని మంగళవారం రేణుక ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వేడుకలో భాగంగా స్థానిక సర్పంచ్ మొతిబాయి లక్ష్మణ్ సింగ్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని మహిళలు బోనాలతో ఊరేగింపుగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం యువత ఆధ్వర్యంలో తోట్టేల ఊరగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేష్, పాలకవర్గం సభ్యులు, గ్రామ పెద్దలు,గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

## గాంధీభవన్ లో సచిన్ సావంత్ తో బండి రమేష్ భేటీ



**కూకట్ పల్లి, ఆగస్టు 11, (నవజ్యోతి ప్రతినిధి):**

కాంగ్రెస్ అధిష్టానం పిలుపు మేరకు టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ మంగళవారం గాంధీభవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఎస్ఐఆర్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి గంప వేణుగోపాల్‌లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో కాంగ్రెస్ కీలకంగా వ్యవహరించిందని సచిన్ సావంత్‌కు వివరించారు. కూకట్‌పల్లిలో బూత్ వారీగా బీఎల్ఏలను నియమించి దొంగ ఓట్లను గుర్తించడంలో విజయం సాధించామన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ ఇంఛార్జిగా పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ పథకాల ప్రచారానికి చేపట్టిన కార్యక్రమాల నివేదికలను సమర్పించారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికలకు సన్నద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.

# అక్రమ షెడ్ కథలో అసలు ట్విస్ట్ ఏంటి..?

- భిక్కనూర్ రైతు వేదికలో పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి...



**భిక్కనూర్, ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి):**

భిక్కనూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 39 మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో చెక్కులు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. లబ్ధిదారుల కుటుంబాలకు పథకం ద్వారా ఆర్థిక భరోసా కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్వో సునీత, ఎంపీడీవో కిరణ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి తిరుమలేష్, పొన్నాల రంజిత్, లక్ష్మి దేవునిపల్లి సర్పంచ్ లింగారెడ్డి, ఉపాధ్యక్షులు నరేందర్‌రెడ్డి, యాదగిరిగౌడ్, ఏక్నాథ్, పవన్, రామచంద్రం పాల్గొన్నారు. వివిధ గ్రామాల అధ్యక్షులు అంజమ్‌రెడ్డి, రాజేందర్, బాలింగం, భాస్కర్, ప్రవీణ్‌గౌడ్, రంజిత్‌కుమార్, వంగేటి నర్సారెడ్డి, బక్క కుమార్, నర్సింలు, రాజ్‌కుమార్, గందం రాజు, అనీల్, సుజిత్, రాజుతో పాటు కార్యకర్తలు, లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**మాచారెడ్డి, పాల్వంచ, బీబీపేట, రాజంపేటల్లోనూ..**

కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని మాచారెడ్డి, పాల్వంచ, బీబీపేట, రాజంపేట మండలాల్లోనూ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. బీబీపేట, రాజంపేట మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా మండలాల లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే ట్రాఫిక్ నిబంధనలు

### ఈ నెల 18 నుంచి అమలు

**హైదరాబాద్ ఆగస్టు 11 (నవజ్యోతి బ్యూరో చీఫ్ టి రాజగోపాల్)**







నగరంలో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హెచ్–సిటీ ప్రాజెక్టు పనులు వేగవంతం కానున్నాయి. ఇందులో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్ నిర్మాణ పనులను చేపట్టనున్నారు. ఐటీ కారిడార్‌కు వెళ్లే ప్రధాన రహదారి ఇదే కావడంతో, ప్రస్తుతం పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు వాహనాల రాకపోకలు తీవ్రంగా మందగిస్తున్నాయి. ఈ ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు, హెచ్–సిటీ ప్రాజెక్టు పనులు పూర్తయ్యే వరకు కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే నిబంధనలను అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ నెల 18వ తేదీ నుంచి కొత్త ట్రాఫిక్ డైవర్షన్లు అమల్లోకి రానున్నాయి. వాహనదారులు దాదాపు ఏడాది పాటు ఈ వన్ వే నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. పనుల దృష్ట్యా ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని వారు కోరారు.

# సూరారం సమస్యలపై 'వన్ డే' ఫోకస్!

- ఫైళ్ల నుంచి ఫీల్డ్ కు..సూరారం సమస్యలపై దృష్టి!
- ప్రజల ముందే సమస్యల చిట్టా..పరిష్కారానికి కమిషనర్ హామీ

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 11 :(నవజ్యోతి ప్రతినిధి) :**





సమస్యల పరిష్కారం కోసం అధికార యంత్రాంగం వార్డు బాట పట్టింది. 'వన్ డే–వన్ వార్డ్' కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డా. జి. సృజన ఐఏఎస్, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ఐఏఎస్ మంగళవారం సూరారం వార్డు (293)లో పర్యటించారు. అంబేద్కర్ భవన్‌లో ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో స్థానిక సమస్యలపై నేరుగా ఆరా తీశారు. సీసీ, బీటీ రోడ్లు, ఫుట్‌పాత్‌లు, పార్కులు, వీధిదీపాలు, వర్షపు నీటి కాలువలతో పాటు భవన నిర్మాణ అనుమతులు, ఆక్రమణల అంశాలు సమావేశంలో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. వర్షాకాలంలో పారిశుద్ధ్య లోపాలు, దోమల బెడద పెరగకుండా ఫాగింగ్, యాంటీ లార్వా చర్యలను ముమ్మరం చేయాలని స్థానికులు కోరారు. కాలనీల్లో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు వేగంగా చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చారు. దీంతో సూరారం వార్డులో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందా అన్నది ఆసక్తిగా మారింది.ఈ సమావేశంలో గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ యు. వెంకట్ రాములు, ఏఎంసీ ప్రమీల, డీవైఈఈ (ఎస్ ఎస్‌డబ్ల్యూఎం) నిఖిల్ రెడ్డి, ఏసీపీ సుమిత్ర, డీవైఈఈ (ఇంజినీరింగ్) మహదేవ్ అనురాగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లికార్జున్, వివిధ కాలనీలవారు పాల్గొన్నారు.

# బోనాల పర్వదినం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు...

### అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలి. నందమూరి దీపిక జానకిరామ్.

**ఉమ్మడి రంగారెడ్డి/ నవాబు పేట్, ఆగస్టు 11, (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**



చేవెళ్ల నియోజకవర్గం నవాబు పేట్ మండల పరిధిలోని మైతాఫ్ ఖాన్ గూడ గ్రామంలో బోనాల పండుగను పురస్కరించుకుని మైతాఫ్ ఖాన్ గూడ గ్రామంలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు నందమూరి దీపిక జానకిరామ్ గ్రామానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది. అమ్మవారి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజల శ్రేయస్సు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, గ్రామంలో సుఖశాంతులు నెలకొనాలని అమ్మవారిని ప్రార్థించారు. గ్రామానికి విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నందమూరి దీపిక జానకిరామ్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమెకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, బోనాల పండుగ వేడుకల్లో పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# బ్రేక్ సెట్టింగ్ వేళ..బస్సు కదిలిందెలా?

- సేఫ్టీ ఉందా..సంతోష్ ప్రాణం ఎందుకు పోయింది?
- ఆర్టీసీ డిపోలో మెకానిక్ దుర్మరణం..భద్రతా నిబంధనలపై ప్రశ్నలు

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి) :**





జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధి జీడిమెట్ల బస్ డిపోలో మంగళవారం ఉదయం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్యారేజీ పిట్‌లో బస్సుకు మరమ్మతులు చేస్తుండగా బస్సు ముందుకు కదలడంతో మెకానిక్ మదన సంతోష్ (40) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.ఫిర్యాదు వివరాల ప్రకారం.. సంతోష్ జీడిమెట్ల బస్ డిపోలో మెకానిక్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం ఫస్ట్ షిఫ్ట్ విధులకు హాజరై బస్ నంబర్ TS 09 Z 0129కు సంబంధించిన పనుల్లో నిమగ్నమయ్యారు. సుమారు 6.30 గంటల సమయంలో అదే బస్సు డ్రైవర్ కృష్ణారావు ఎలాంటి సంకేతాలు ఇవ్వకుండా, భద్రతా జాగ్రత్తలు పాటించకుండా బస్సును ముందుకు నడిపినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. దీంతో బస్సు బంపర్ సంతోష్ తల, ఛాతీ భాగాలను బలంగా ఢీకొట్టడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందినట్లు పేర్కొన్నారు. సహోద్యోగి మెకానిక్ గోపాల్ ఫోన్‌లో సమాచారం ఇవ్వడంతో సంతోష్ భార్య ధనశ్రీ డిపోకు చేరుకున్నారు. అప్పటికే భర్త తీవ్ర గాయాలతో మృతిచెంది ఉన్నట్లు ఫిర్యాదులో తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# చెత్త కుప్పకు చెక్!

- **వార్త వెలువడిన వెంటనే కదిలిన దుండిగల్ సర్కిల్ శానిటేషన్ యంత్రాంగం**
- **గండి మైసమ్మ–నర్సాపూర్ రోడ్డుపై చెత్త తొలగింపు..స్థానికుల హర్షం**

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి) :**

వారం రోజులుగా కనిపించిన చెత్త కుప్ప.. ఒక్క వార్తతో కనుమరుగు! గండి మైసమ్మ–నర్సాపూర్ ప్రధాన రహదారిపై ఎంఆర్ఎఫ్ షోరూమ్ సమీపంలో ఫుట్‌పాత్ చెత్తకు అడ్డాగా మారిన పరిస్థితిపై 'నవజ్యోతి'లో ప్రధాన రహదారి ప్రక్కనే చెత్త కుప్పలు......అధికారుల చూపు ఎక్కడ? కథనం ప్రచురితమైన వెంటనే దుండిగల్ సర్కిల్ శానిటేషన్ అధికారులు స్పందించారు. సిబ్బందిని రంగంలోకి దించి చెత్తను తొలగించారు.

**పేపర్‌లో సమస్య..క్షేత్రంలో పరిష్కారం**

ప్రధాన రహదారి పక్కనే చెత్త పేరుకుపోయినా




పట్టించుకునే వారు లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను 'నవజ్యోతి' గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. కథనం వెలువడిన వెంటనే అధికారులు స్పందించడం, చెత్తను తొలగించడం జరిగింది.

**నవజ్యోతి ఎఫెక్ట్..**

**ఫుట్‌పాత్‌కు మళ్లీ 'ఫ్రీ స్పేస్'**

చెత్తాచెదారంతో కనిపించకుండా పోయిన ఫుట్‌పాత్ ఇప్పుడు శుభ్రంగా మారింది. వాహనదారులు, పాదచారులకు ఇబ్బందిగా ఉన్న పరిస్థితి తొలగింది. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

**ఇది ముగింపు కాదు..మొదటి అడుగు**

చెత్త తొలగింపుతో సమస్య పరిష్కారమైనప్పటికీ.. తిరిగి అదే ప్రాంతం డంపింగ్ పాయింట్‌గా మారకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే. ప్రధాన రహదారి కావడంతో నిరంతర పర్యవేక్షణ, క్రమం తప్పని పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**నవజ్యోతి ఎఫెక్ట్**

ప్రజా సమస్యను గుర్తించి వెలుగులోకి తీసుకువస్తే.. సంబంధిత యంత్రాంగం స్పందించి పరిష్కారం చూపుతుందనే దానికి గండి మైసమ్మ–నర్సాపూర్ రహదారి ఘటన మరో ఉదాహరణగా నిలిచింది.

# సలాక కృష్ణమూర్తి శర్మ కి జ్యోతిష్య రత్న బిరుదుతో అరుదైన గౌరవం

**పలువురి ప్రశంసలు....**

**తూప్రాన్, 11 ఆగష్టు ( నవజ్యోతి ప్రతినిధి నవీన్ ) :**

ఆధ్యాత్మికతకు, సనాతన ధర్మ పరిరక్షణకు, వేద సంస్కృతికి ప్రతీకగా నిలుస్తున్న బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోనీ ముత్తాయికోటాలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవ సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు మోత్కూరి రామేశ్వర్ శర్మ, మెదక్ జిల్లా అధ్యక్షులు శాలాక రాజేశ్వర్ శర్మ నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్య క్రమానికి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువత, బ్రాహ్మణ బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ప్రముఖ సీనియర్ బ్రాహ్మణోత్తములు, అపర చాణక్యుడిగా పేరుగాంచిన, ఎందరో జీవితాలకు జ్యోతిష్య జ్ఞానంతో మార్గదర్శకత్వం అందించిన జ్యోతిష్య నిపుణులు బ్రహ్మశ్రీ శాలాక కృష్ణమూర్తి శర్మ విశిష్ట సేవలను గుర్తిస్తూ "జ్యోతిష్య రత్న" అనే ప్రతిష్ఠాత్మక బిరుదును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. వేదాలు, శాస్త్రాలు, జ్యోతిష్య విజ్ఞానం పట్ల అపారమైన పాండిత్యాన్ని కలిగి, గ్రహ గతులను విశ్లేషిస్తూ అనేకమంది జీవితాల్లో వెలుగులు నింపిన శాలాక కృష్ణమూర్తి శర్మ సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. జ్యోతిష్య శాస్త్రాన్ని కేవలం భవిష్యత్తును చెప్పే ప్రక్రియగా కాకుండా, మనిషి జీవితానికి దిశానిర్దేశం చేసే జ్ఞానవిజ్ఞానంగా భావిస్తూ ఆయన అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. "గ్రహాల గమనాన్ని గమనించి... జీవిత గమనానికి మార్గం చూపే జ్యోతిష్య పాండిత్యం" అనే రీతిలో శాలాక కృష్ణమూర్తి శర్మ సేవలను పలువురు ప్రశంసించారు. ఆయన జ్ఞానం, అనుభవం, ఆధ్యాత్మిక చింతన, జ్యోతిష్య పరిజ్ఞానం ఎంతోమందికి ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని అందించాయని అన్నారు. గోరింటాకు సంబరంలో మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని గోరింటాకు పెట్టుకుంటూ, సాంస్కృతిక




కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సనాతన ధర్మ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# ప్రజా రక్షణ కేంద్రానికే ముప్పు..

- **అల్వాల్ గోకుల్ నగర్‌లో అస్తవ్యస్తంగా బస్తీ దవాఖాన పరిసరాలు!**

**అల్వాల్/ఆగస్టు 11,(నవజ్యోతి ప్రతినిధి):-**

అల్వాల్ సర్కిల్ పరిధిలోని వెంకటపురం గోకుల్ నగర్ బస్తీ దవాఖాన పరిసరాలు అధికారుల నిర్లక్ష్యంతో అస్తవ్యస్తంగా మారాయి.శానిటరీ ఇంజనీరింగ్ శాఖ సిబ్బంది ఆసుపత్రి ప్రాంగణంలో బారికేడ్లు, విరిగిపడిన చెట్లు అలాగే ఉండటం, మ్యాన్‌హోల్స్ బ్లాక్స్ వాటివి పేరుకు పోయాయి దీంతో అనారోగ్యంతో వచ్చే చిన్నపిల్లలు,వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ



సమస్యలపై మున్సిపల్ అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించలేదని బస్తీ దవాఖాన వైద్యులు డాక్టర్ సూరజ్ మీడియా ఇంటర్వ్యూలో ఆవేదన వ్యక్తం చేశారు.దవాఖాన లోపల మాత్రం వైద్య సేవలకు ఎలాంటి కొరత లేదని డాక్టర్ సూరజ్ స్పష్టం చేశారు.సాధారణ చికిత్సకు అవసరమైన అన్ని రకాల మందులు, ట్యాబ్లెట్లు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని,చుట్టుపక్కల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఇప్పటికైనా జీహెచ్ఎంసీ, ఇంజనీరింగ్ శాఖ అధికారులు స్పందించి బస్తీ దవాఖాన వద్ద ఉన్న అడ్డంకులను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# చేవెళ్ల–శంకర్ పల్లి మార్గంలో ఆర్టీసీ బస్సుల కొరత...

- **బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షణ.**
- **విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికుల అవస్థలు.**
- **రద్దీ సమయాల్లో మరింత తీవ్రంగా మారుతున్న సమస్య.**
- **సమయపాలన లేకపోవడంతో ప్రయాణికుల్లో తీవ్ర అసంతృప్తి.**
- **అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్.**

**ఉమ్మడి రంగారెడ్డి/ చేవెళ్ల, ఆగస్టు 11, (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**

చేవెళ్ల–శంకర్ పల్లి, శంకర్ పల్లి–చేవెళ్ల మధ్య ఆర్టీసీ బస్సుల రాకపోకలు సక్రమంగా లేకపోవడంతో నిత్యం ప్రయాణించే ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు అందుబాటులో లేకపోవడంతో బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. బస్సు వస్తుందో లేదో తెలియని పరిస్థితిలో ప్రయాణికులు రోడ్లపై నిరీక్షిస్తూ తీవ్ర అవస్థలు పడుతున్నారు. చేవెళ్ల నుంచి శంకర్ పల్లి వైపు, శంకర్ పల్లి నుంచి చేవెళ్ల వైపు నిత్యం వేలాది మంది వివిధ అవసరాల కోసం రాకపోకలు సాగిస్తున్నారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు, ఉద్యోగులు తమ విధులకు, ప్రజలు వివిధ పనుల నిమిత్తం ఈ మార్గంపై ఆధారపడుతున్నారు. అయితే ప్రయాణికుల అవసరాలకు తగిన స్థాయిలో బస్సు సర్వీసులు లేకపోవడంతో సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. ఉదయం వేళల్లో బస్సుల కోసం ఎక్కువసేపు వేచి ఉండాల్సి రావడంతో పాఠశాలలు, కళాశాలలకు ఆలస్యంగా చేరుకోవాల్సి వస్తోందని విద్యార్థులు చెబుతున్నారు. సాయంత్రం వేళల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో ఇంటికి చేరుకునేందుకు ఎక్కువ సమయం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు సైతం బస్సుల కోసం నిరీక్షించాల్సి రావడం మరింత ఆందోళన కలిగిస్తోంది. చేవెళ్ల–శంకర్ పల్లి మార్గంలో బస్సుల కొరతతో పాటు సమయపాలనపై కూడా ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. బస్సులు నిర్ణీత సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు తమ ప్రయాణ సమయాన్ని ముందుగా అంచనా వేసుకోలేని పరిస్థితి నెలకొంది. ఒక బస్సు వెళ్లిపోయిన తర్వాత మరో బస్సు కోసం ఎక్కువసేపు వేచి ఉండాల్సి వస్తోందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. రద్దీ సమయాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారి బస్సుల్లో తీవ్ర రద్దీ నెలకొంటోందని చెబుతున్నారు. హైదరాబాద్ –శంకర్ పల్లి మధ్య మెట్రో డీలక్స్ బస్సులు అందుబాటులో ఉన్నప్పటికీ, చేవెళ్ల–శంకర్ పల్లి మధ్య నేరుగా ప్రయాణించే వారికి సరిపడా ఆర్టీసీ సర్వీసులు లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని ప్రయాణికులు అంటున్నారు. రెండు ముఖ్యమైన పట్టణాలను కలిపే ఈ మార్గంలో రోజురోజుకూ ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ప్రజా రవాణా వ్యవస్థలో ఆర్టీసీకి కీలకమైన బాధ్యత ఉందని, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, సామాన్య




ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడం అధికారుల బాధ్యత అని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా సర్వీసులను పెంచకుండా పాత విధానంలోనే బస్సులను నడపడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున ఆర్టీసీ ఉన్నతాధికారులు ఈ సమస్యపై తక్షణమే దృష్టి సారించి చేవెళ్ల–శంకర్ పల్లి, శంకర్ పల్లి–చేవెళ్ల మధ్య అదనపు బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో ప్రత్యేక సర్వీసులు నడపాలని ప్రయాణికులు, విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. బస్సులు నిర్ణీత సమయాలకు చేరుకునేలా సమయపాలనను పర్యవేక్షించి, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ప్రజల నిత్య ప్రయాణానికి అత్యంత కీలకమైన ఈ మార్గంలో బస్సుల కొరత సమస్యను అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా, క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి అవసరమైన మేరకు బస్సులను పెంచుతారా? లేక ప్రయాణికుల ఇబ్బందులు ఇలాగే కొనసాగుతాయా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

# తలుపులమ్మ తల్లి బోనాల జాతరలో బండి రమేష్



**కూకట్‌పల్లి, ఆగస్టు 11, (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రత్యేక ప్రతీక అని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి ఇన్‌చార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. తలుపులమ్మ తల్లి – నీలమణి దుర్గమ్మ తల్లి దేవస్థానంలో మంగళవారం నిర్వహించిన అమ్మవారి బోనాల జాతర మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనం సమర్పించి ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రశాంతి నగర్ డివిజన్ అధ్యక్షుడు చందద్రావు, నాయకులు నాగార్జున, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, వాసు, రమణ, పాల్గొన రావు, కామినేని వాసు తదితరులు పాల్గొన్నారు.

# దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసిన గొట్టిముక్కల వెంగళరావు



**కూకట్‌పల్లి, ఆగస్టు 11, (నవజ్యోతి ప్రతినిధి):**

ఆషాఢ మాసం బోనాల పండుగను పురస్కరించుకుని ఏవీబీ పురంలోని తలుపులమ్మ నీలమణి దుర్గమ్మ తల్లి ఆలయంలో మంగళవారం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆయన ప్రార్థించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# సీపీ రమేష్ రెడ్డిని కలసిన పిడికిటి గోపాల్ చౌదరి

**కూకట్ పల్లి, ఆగస్టు 11, (నవజ్యోతి ప్రతినిధి):**

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డిని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు పిడికిటి గోపాల్ చౌదరి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషనర్‌ను కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు స్థానిక ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు పోలీస్ వ్యవస్థ చేపడుతున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ



కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి డీసీ ఆదేశం



**కూకట్‌పల్లి, ఆగస్టు 11, (నవజ్యోతి ప్రతినిధి):**

భాగ్యనగర్ కాలనీలో ఇంటింటి చెత్త సేకరణ తీరును ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్త సేకరణ క్రమబద్ధంగా జరగాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. అనంతరం జయసూర్య నగర్‌లో దెబ్బతిన్న మ్యాన్‌హోల్‌ను పరిశీలించి, సమస్యను తక్షణమే పరిష్కరించాలని జలమండలి అధికారులకు పంపించారు. స్థానిక ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఎస్ఆర్పీ, ఎస్ఎఫ్ఏ సిబ్బంది పాల్గొన్నారు.

## జేఎన్‌టీయూహెచ్ ఆధ్వర్యంలో సాంకేతిక వర్క్‌షాప్‌లు



**కూకట్‌పల్లి, ఆగస్టు 11, (నవజ్యోతి ప్రతినిధి):**

నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నిజ జీవిత సవాళ్లకు వినూత్న పరిష్కారాలు కనుగొనేలా విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యంగా జేఎన్‌టీయూహెచ్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ – టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ (J-TBI) సాంకేతిక వర్క్‌షాప్‌లను ప్రారంభించింది. టెక్నో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సిరీస్ (TES)లో భాగంగా డ్రోన్లు, ఏఆర్/వీఆర్, ఐఓటీ, సాలిడ్‌వర్క్స్ వంటి ఆధునిక అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.జగిత్యాల జేఎన్‌టీయూహెచ్ ఇంజనీరింగ్ కాలేజీలో 100 మంది విద్యార్థులకు డ్రోన్ల సాంకేతికతపై, సిరిసిల్ల కాలేజీలో 100 మందితో ఐఓటీపై వర్క్‌షాప్‌లు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన ఎంపిక చేసిన బృందాలకు బూట్‌క్యాంప్‌ల ద్వారా మార్గదర్శకత్వం అందించి, స్టార్టప్‌ల ఏర్పాటుకు జేఎన్‌టీయూహెచ్–టీబీఐలో ఇంక్యుబేషన్ మద్దతు ఇస్తామని నిర్వాహకులు తెలిపారు.

## గాయత్రి డిగ్రీ కళాశాలలో ఘనంగా బోనాల ఉత్సవాలు



**మేడ్చల్, ఆగస్టు 11( నవజ్యోతి ప్రతినిధి) :**

మేడ్చల్ పట్టణంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో మంగళవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, బోనాలను అందంగా అలంకరించి కళాశాలకు తీసుకొచ్చారు. విద్యార్థినులు పట్టణంలోని ఏడు గుడుల దేవాలయంలో అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు మరియు బోనాల పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడానికి ఈ వేడుకను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య సభ్యులు గణేష్, శివ, కమలాకర్ రెడ్డి, దేవరాజ్, సత్యనారాయణ, శ్రీనివాస్, అలాగే అధ్యాపకులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంకిరెడ్డిపల్లిలో బోనాల ఉత్సవాలకు ఆహ్వానం

### మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ కు ఆహ్వానం



**కీసర,ఆగస్టు 11,(నవజ్యోతి ప్రతినిధి) :**

కీసర డివిజన్–1 పరిధిలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో ఈ నెల 16న నిర్వహించనున్న బోనాల పండుగ ఉత్సవాలకు మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌ను గ్రామ నాయకులు, కీసర డివిజన్–1 కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.ఈ సందర్భంగా బోనాల ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు, కార్యక్రమ వివరాలను నాయకులు ఆయనకు వివరించారు. ప్రతి ఏడాది సంప్రదాయబద్ధంగా నిర్వహించే బోనాల వేడుకలను ఈసారి కూడా భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం లో మేడ్చల్ & మల్కాజిగిరి జిల్లా ఆర్యవైశ్య మహా సభ అధ్యక్షులు..కీసర మాజీ ఉపసర్పంచ్ & మాజీ ఎంపీటిసి బెలిదే రమేష్ గుప్తా,కీసర మండల కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు రామిడి విజయ్ రెడ్డి,గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## వివాహ వేడుక..సేవా సందడి..

- **గడ్డం వినోద్ వివాహ వేడుక.. కార్యకర్తలు సేవా బాట!..**
- **రోగులకు పండ్ల పంపిణీ..**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 11**

ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట్ స్వామి, గడ్డం రమాదేవి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ కాంగ్రెస్ నాయకులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక సందర్భాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావా స్వాతి రమేష్ బాబు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రోగుల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. 19వ వార్డు బెల్లంపల్లి బస్తీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాంపెల్లి శ్రీనివాస్ ఆసుపత్రిలోని రోగులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ వారికి పండ్లు అందజేశారు. వివాహ వార్షికోత్సవం వంటి ప్రత్యేక సందర్భాలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ద్వారా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తున్నామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రజలకు అండగా నిలుస్తూ భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు..

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

- **కాలనీలకు జాతీయ జెండాలు పంపిణీ చేసిన నాగారం మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి**

**నాగారం, ఆగస్టు 11,(నవజ్యోతి ప్రతినిధి)**



ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలనే పిలుపులో భాగంగా నాగారం మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి వివిధ కాలనీలకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ పరిధిలోని పలు కాలనీలు చండీశ్వర్ నగర్ కాలనీ – 50 జెండాలు,నేతాజీ నగర్ కాలనీ–100 జెండాలు, ఈస్ట్ గాంధీనగర్ – 50 జెండాలు,వెస్ట్ గాంధీనగర్ – 50 జెండాలు,శ్రీరామ్ నగర్ కాలనీ – 50 జెండాలు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ... ఆయా కాలనీల ప్రతినిధులు, నాయకులు జాతీయ జెండాలను అందజేయాలని కోరగా, చంద్రారెడ్డి స్పందించి జెం డాలను అందించామన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు. జాతీయ జెండా మన స్వాతంత్ర్యానికి, దేశ ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు.ఇంకా జాతీయ జెండాలు అవసరమైన వారు తనను సంప్రదించవచ్చని తెలిపారు.

# జమ్మిగడ్డలో నల్లపోచమ్మ బోనాల సందడి

- **పాలహారం బండి కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకుడు గోగికర్ శివకుమార్‌కు ఆహ్వానం**

**కాప్రా, ఆగస్టు 11,(నవజ్యోతి ప్రతినిధి) :**



కాప్రా డివిజన్ పరిధిలోని జామిగడ్డలో శ్రీ శ్రీ శ్రీ నల్లపోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న పాలహారం బండి బోనాల కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకుడు గోగికర్ శివకుమార్‌ను ఉత్సవ నిర్వాహకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించా రు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పాలహారం బండి ఊరేగింపుతో ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోగికర్ శివకుమార్ మాట్లాడుతూ, నల్లపోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. బోనాల ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

# సహకార సంఘాలను కాంగ్రెస్ రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చింది

- **పీఏసీఎస్ ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పదవులు ఎందుకు?: ఏనుగు సుదర్శన్ రెడ్డి**
- **రైతుల ప్రయోజనాలను విస్మరిస్తే సహించేది లేదని హెచ్చరిక**

**ఘట్కేసర్, ఆగస్టు 11,(నవజ్యోతి ప్రతినిధి):**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించకుండా, ఎన్నికలు నిర్వహించకుండానే నామినేటెడ్ పాలకవర్గాలను ఏర్పాటు చేయడంపై మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎదులాబాద్ డివిజన్‌లోని శివాలయం వద్ద ఎదులాబాద్ రైతు పరస్పర సహకార పొదుపు సంఘం అధ్యక్షుడు శంకరప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ, సహకార సంఘాల్లో సభ్యులు తమ ఓటు హక్కుతో పాలకవర్గాలను ఎన్నుకునే అవకాశం ఉండాలని, ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పద్ధతిలో పదవులు భర్తీ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితి ఉంటే చట్టబద్ధమైన విధానాల ప్రకారం ప్రత్యేక అధికారులు లేదా పర్సన్ ఇన్‌చార్జీలను నియమించాల్సి ఉంటుందని, అయితే రాజకీయ కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇవ్వడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన ఆరోపించారు. రైతుల ప్రయోజనాల కోసం పనిచేయాల్సిన పీఏసీఎస్‌లను రాజకీయ ప్రయోజనాలకు వేదికగా మార్చడం సరికాదన్నారు. సహకార రంగంపై అవగాహన, రైతుల సమస్యలపై అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండగా, కేవలం రాజకీయ అనుబంధం ఆధారంగా పదవులు ఇవ్వడం వల్ల సహకార వ్యవస్థ బలహీనపడే ప్రమాదం ఉందన్నారు.

**డబ్బులు చేతులు మారుతున్నాయన్న ఆరోపణలపై విచారణ జరపాలి**

సహకార సంఘాల డైరెక్టర్, చైర్మన్ పదవుల కోసం భారీగా డబ్బులు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలు వాస్తవమా కాదా అన్నది తేల్చేందుకు ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.సహకార సంఘాల పదవులు రైతుల ఓట్ల ద్వారా నిర్ణయించబడాలని, డబ్బు, రాజకీయ పలుకుబడితో పదవులు నిర్ణయించే పరిస్థితి ఏర్పడితే సహకార వ్యవస్థ లక్ష్యం దెబ్బతింటుందని అన్నారు.

**పీఏసీఎస్ లకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలి**



సహకార సంఘాల్లో ప్రజాస్వామ్య నిర్వహణ, సభ్యుల భాగస్వామ్యం, స్వయం ప్రతిపత్తికి ప్రాధాన్యం ఇవ్వాలని సుదర్శన్‌రెడ్డి కోరారు. దీర్ఘకాలంగా ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలకవర్గాలను కొనసాగించడంపై ప్రభుత్వం పునఃసమీక్ష చేయాలని, వీలైనంత త్వరగా పీఏసీఎస్ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. "ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారూ.. సహకార సంఘాల్లో ప్రజాస్వామ్యం ఎందుకు వద్దు? రైతుల సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పదవులు ఎందుకు? సహకార వ్యవస్థను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం సరికాదు" అని ఆయన ప్రశ్నించారు.

**ఘట్కేసర్ రైతులకు రుణమాఫీపై ప్రశ్నలు**

ఘట్కేసర్ మండలంలోని రైతులకు రుణమాఫీ పూర్తిగా అందలేదని సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు.అర్హులైన రైతులకు రుణమాఫీ నిధులను వెంటనే విడుదల చేసి, ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పీఏసీఎస్‌లను రాజకీయ జోక్యం నుంచి కాపాడి, రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని, నామినేటెడ్ పాలకవర్గాల వ్యవహారంపై సమీక్షించి, ఎన్నికలకు స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాలని ఏనుగు సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా రైతు సమైక్య సంఘం అధ్యక్షుడు ముద్దం సంజీవరెడ్డి,మాజీ ఎంపీటీసీ గట్టగల రవి,జిల్లా కార్యదర్శి ఎస్.ఆంజనేయులు,మాజీ అధ్యక్షుడు మల్లారెడ్డి,ఎదులాబాద్ రైతు పరస్పర సహాయక పొదుపు సంఘం ఉపాధ్యక్షుడు కే.ప్రభాకరచారి,కార్యదర్శి పూస మాణిక్యం,సహాయక కార్యదర్శి ఎర్రోళ్ల మురళి, మంకం బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# మంజూరైన పనులకు ఇక బ్రేక్ వద్దు.. వెంటనే పనులు ప్రారంభించాలి

- **రామంతాపూర్ అభివృద్ధిపై జోనల్ కమిషనర్ రాధిక గుప్తతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి భేటీ**

**ఉప్పల్, ఆగస్టు 11,(నవజ్యోతి ప్రతినిధి):**

రామంతాపూర్ డివిజన్‌లో ఇప్పటికే మంజూరైన అభివృద్ధి పనులను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులను కోరారు. మంజూరైన నిధులు ఉన్నప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంపై ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిసి రామంతాపూర్ డివిజన్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. ఇప్పటికే మంజూరైన పనుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న పనులు, వాటి ప్రారంభానికి ఎదురవుతున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీ, మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంజూరైన పనులను తక్షణమే ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా రామంతాపూర్ డివిజన్‌లో ఇంకా అవసరమైన నూతన అభివృద్ధి పనులను గుర్తించి, వాటికి అవసరమైన నిధులు కేటాయించాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా రోడ్లు, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత



ఇవ్వాలని సూచించారు."నిధులు మంజూరైన తర్వాత పనులు ఆలస్యం కావడం సరికాదు. ప్రజలకు ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తీసుకురావడమే లక్ష్యం. రామంతాపూర్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి అల్లర్లకు పాల్పడిన 10 మందికి జైలు

- మహిళలను వేధిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక





**కుషాయిగూడ, ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి):**

కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి వేళల్లో మద్యం సేవించి రోడ్లపై అల్లర్లు చేస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలిగించిన 10 మందిపై పోలీసులు చట్టపరమైన చర్యలు చేపట్టారు. మహిళలను వేధిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై సంబంధిత చట్టపరమైన నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి, అనంతరం గౌరవ న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. కేసులను విచారించిన న్యాయస్థానం 10 మంది నిందితులకు ఒక్కొక్కరికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. రాత్రి సమయాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, మహిళలను వేధించడం, అసభ్యంగా ప్రవర్తించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడడం వంటి వాటిని ఏమాత్రం ఉపేక్షించబోమని పోలీసులు స్పష్టం చేశారు.ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వారిపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటం

- టీయూడబ్ల్యూజే–ఐజేయూ పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షుడిగా పత్తి నర్సింహ ఏకగ్రీవ ఎన్నిక
- జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..
- వ్యక్తిగత విభేదాలకు తావులేదు



**రామచంద్రాపురం, ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి):**

జర్నలిస్టుల హక్కులు, వృత్తి గౌరవం, సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేస్తామని టీయూడబ్ల్యూజే–ఐజేయూ పటాన్‌చెరు నియోజకవర్గ నూతన అధ్యక్షుడు పత్తి నర్సింహ అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. మంగళవారం రామచంద్రాపురం పట్టణంలోని లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించిన జర్నలిస్టుల సమావేశంలో పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షుడిగా పత్తి నర్సింహను జర్నలిస్టులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడికి జర్నలిస్టులు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పత్తి నర్సింహ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న జర్నలిస్టు మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను పదవిగా కాకుండా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పనిచేసే అవకాశంగా భావిస్తున్నానన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిని సంఘం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, వృత్తి గౌరవం, సంక్షేమం విషయంలో రాజీ పడకుండా ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకు సాగుతానన్నారు. వ్యక్తిగత విభేదాలకు తావులేకుండా జర్నలిస్టులంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని జర్నలిస్టుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వారి తరపున పోరాడేందుకు సంఘాన్ని వేదికగా ఉపయోగిస్తామని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన టీయూడబ్ల్యూజే–ఐజేయూ రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, ఉపాధ్యక్షులు ఫైసల్, జిల్లా అధ్యక్షులు బండారు యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులందరికీ పత్తి నర్సింహ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న పటాన్‌చెరు నియోజకవర్గ జర్నలిస్టు మిత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. పత్తి నర్సింహ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల జర్నలిస్టు మిత్రులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో పటాన్‌చెరు నియోజకవర్గంలో జర్నలిస్టుల ఐక్యత మరింత బలోపేతం కావడంతో పాటు, జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి సంఘం మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

# మద్యం మత్తులో కత్తితో హల్ చల్.. నేతాజీ నగర్ లో కలకలం

- డయల్–100 సమాచారంతో రంగంలోకి దిగిన కుషాయిగూడ పోలీసులు
- భార్యను బెదిరించేందుకు కత్తితో తిరిగినట్లు విచారణలో వెల్లడి



**కుషాయిగూడ,ఆగస్టు 11,(నవజ్యోతి ప్రతినిధి) :**

మద్యం మత్తులో ఓ వ్యక్తి కత్తితో వీధుల్లో తిరుగుతూ హల్ చల్ చేసిన ఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని నేతాజీ నగర్ ప్రాంతంలో కలకలం రేపింది. స్థానికుల సమాచారం మేరకు డయల్–100కు ఫోన్ రావడంతో కుషాయిగూడ పోలీసులు వెంటనే స్పందించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. నేతాజీ నగర్ ప్రాంతంలో ఓ వ్యక్తి చేతిలో కత్తితో తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాడని డయల్–100 ద్వారా సమాచారం అందింది. సమాచారం అందుకున్న కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని విచారించగ పులి కృష్ణ (27), తండ్రి ఖాదర్, ఎం.జే. కాలనీ, స్ట్రీట్ నంబర్–03కు చెందిన వ్యక్తి కూరగాయలు తరిగే కత్తితో తిరుగుతూ కనిపించడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల ప్రాథమిక విచారణలో భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు ఉన్నట్లు, మద్యం సేవించిన అనంతరం భార్యను బెదిరించాలనే ఉద్దేశంతో కత్తి చేతపట్టి బయటకు వచ్చినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

**డయల్–100కు సమాచారం..**

**వెంటనే స్పందించిన పోలీసులు**

సమాచారం అందిన వెంటనే పెట్రోలింగ్ సిబ్బంది అప్రమత్తమై సంఘటనా స్థలానికి చేరుకోవడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. అనంతరం కృష్ణను కుషాయిగూడ పోలీస్ స్టేషన్ కు తరలించి, ఘటనపై కేసు నమోదు చేశారు.ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను సేకరిస్తూ పోలీసులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు**

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి గొడవలకు దిగడం, ఆయుధాలతో హల్ చల్ చేయడం, ఇతరులను బెదిరించడం వంటి చర్యలను ఏమాత్రం ఉపేక్షించబోమని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు సంఘటితంగా పనిచేయాలి

- 70 ఏళ్ల చరిత్ర గల సంఘం మనది..
- క్రమశిక్షణకు మారుపేరు టీయూడబ్ల్యూజే–ఐజేయూ
- అక్రిడేషన్లు, బస్సుపాస్ ల సాధనలో సంఘం కీలక పాత్ర
- ఐజేయూ జాతీయ సమావేశంలో సంగారెడ్డి జిల్లాకు మంచి పేరు



**రామచంద్రాపురం, ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి):**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం జర్నలిస్టులంతా ఐక్యంగా, సంఘటితంగా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్–ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఏ ఫైజల్ అన్నారు. మంగళవారం రామచంద్రాపురంలోని లక్ష్మీ గార్డెన్‌లో పటాన్‌చెరు నియోజకవర్గ టీయూడబ్ల్యూజే–ఐజేయూ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఏ ఫైజల్ మాట్లాడుతూ 70 ఏళ్ల చరిత్ర కలిగిన టీయూడబ్ల్యూజే–ఐజేయూ క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘం ఎప్పటికప్పుడు కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు బస్సు పాస్ సౌకర్యం కల్పించడంలో టీయూడబ్ల్యూజే–ఐజేయూ పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. జిల్లాలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు అందేలా కృషి చేస్తామని తెలిపారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రత, హక్కుల పరిరక్షణతో పాటు వారి సంక్షేమానికి సంఘం కట్టుబడి ఉందన్నారు. నియమనిబంధనలకు లోబడి సంఘం పనిచేస్తుందని, జర్నలిస్టులందరినీ కలుపుకొని సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల నిర్వహించిన ఐజేయూ జాతీయ సమావేశంలో సంగారెడ్డి జిల్లా ప్రతినిధులు చురుకుగా పాల్గొని జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చారని అభినందించారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ టీయూడబ్ల్యూజే–ఐజేయూలో ప్రతి జర్నలిస్టుకు సముచిత గౌరవం లభిస్తుందన్నారు. జర్నలిస్టుల గౌరవం, భద్రత, హక్కుల విషయంలో అవసరమైన సందర్భాల్లో అందరూ సంఘటితంగా గొంతెత్తాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ పటాన్‌చెరు జర్నలిస్టుల సమిష్టి కృషి, సహకారంతోనే తాను అంచెలంచెలుగా జిల్లా స్థాయికి ఎదిగానన్నారు. పటాన్‌చెరు జర్నలిస్టులకు తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, సభా వేదికగా వారికి పాదాభివందనం చేస్తున్నానని పేర్కొన్నారు. సంఘం బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. టీయూడబ్ల్యూజే–ఐజేయూ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి చెన్న బసవేశ్వర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథ్, జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా జాయింట్ సెక్రటరీ భూపాల్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్, ఈసీ సభ్యులు మజీద్, శ్రీనివాస్, ఫోటోగ్రాఫర్ జిల్లా అధ్యక్షుడు ఆరీఫ్, చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్దిఖ్, జనరల్ సెక్రటరీ ఈశ్వర్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కార్యవర్గం సమావేశం అనంతరం పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గ టీయూడబ్ల్యూజే–ఐజేయూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**అధ్యక్షుడు:** పత్తి నర్సింహ

**ప్రధాన కార్యదర్శి:** యాదగిరి

**సలహాదారులు:** కాశీపతి, సులేమాన్, రామారావు ఉపాధ్యక్షులు: విఠల్, నగేష్, శివకుమార్, జెమిని రాజు, రమేష్, జీవరత్నం జాయింట్ సెక్రటరీలు: వేణు, ప్రభాకర్, శ్రీనివాస్, కోటేష్, శివాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీలు: ఆంజనేయులు, గాండ్ల మహేష్, వివేక్, రాజు కోశాధికారి: శ్రీనివాస్ రెడ్డి ఈసీ సభ్యులు: శ్రీనివాస్, శంకర్, శేఖర్, మహేందర్ గౌడ్, సిద్దు, శ్రీనివాస్ మామా, రాజశేఖర్, ప్రదీప్ రెడ్డి, విజయ్, నాయుడు. నూతన కార్యవర్గ సభ్యులను రాష్ట్ర, జిల్లా నాయకులు, తోటి జర్నలిస్టులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త కార్యవర్గం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

# కార్యకర్త నుంచి రాష్ట్రస్థాయి బాధ్యతల వరకు.. బైతి శ్రీధర్

- ఆర్ ఎస్ ఎస్ , ఏబీవీపీ , బీజేవైఎం లో సేవ.. తొండుపల్లి ఎంపీటీసి గా ప్రజాప్రతినిధి
- బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా కొత్త బాధ్యత
- శంషాబాద్: బైతి శ్రీధర్ రాజకీయ ప్రస్థానం





**రాజేంద్రనగర్ ఆగస్టు 11: (నవ జ్యోతి ప్రతినిధి)**

క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి నేడు రాష్ట్రస్థాయి నాయకుడిగా ఎదిగిన బైతి శ్రీధర్. అంచెలంచెలుగా కొనసాగుతోంది. ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా ప్రారంభమైన ఆయన ప్రయాణం ఏబీవీపీ , బీజేవైఎం లో వివిధ బాధ్యతల నిర్వహణతో కొనసాగింది. అనంతరం తొండుపల్లి ఎంపీటీసి గా ప్రజాప్రతినిధిగా పనిచేశారు. తాజాగా బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆర్ఎస్ఎస్ లో పనిచేసిన సమయంలో క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకున్న శ్రీధర్.. ఏబీవీపీ లో విద్యార్థుల సమస్యలపై పనిచేశారు. బీజేవైఎం లో యువతను సంఘటితం చేయడంతో పాటు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. తొండుపల్లి ఎంపీటీసి గా ఉన్న సమయంలో స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నించారు. ప్రస్తుతం ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్.. ఓబీసీ వర్గాల సమస్యలపై పనిచేయడంతో పాటు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

# మొబైల్ కోసం తల్లితో గొడవ.. 11 ఏళ్ల బాలుడు అదృశ్యం..

**రాజేంద్రనగర్ ఆగస్టు 11:(నవ జ్యోతి ప్రతినిధి)**



మొబైల్ ఫోన్ విషయంలో తల్లితో గొడవపడిన 11 ఏళ్ల బాలుడు ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన ఘటన శంషాబాద్‌లోని ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. డ్రీమ్ అవెన్యూ ప్రాంతానికి చెందిన ఇబ్రహీం మొల్లా ఈ నెల 10న సాయంత్రం 7 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆర్జీఐఏ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు బాలుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్: 8712663319, ఎస్సై: 8712663311 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# కొత్త సుధాకర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి :

## కంఠారెడ్డి తిరుపతిరెడ్డి



**రామాయంపేట,ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్):**

మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొత్త సుధాకర్‌రెడ్డి తల్లి కొత్త శ్యామల ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మెదక్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మంగళవారం కాట్రియాల్ గ్రామానికి వెళ్లి సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన తిరుపతిరెడ్డి, శ్యామల మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు.ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల కుటుంబాలకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.కార్యకర్త కుటుంబంలో విషాదం చోటుచేసుకున్న సమయంలో స్వయంగా గ్రామానికి వచ్చి పరామర్శించడం పట్ల సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిల్లం శ్యామ్‌రెడ్డి, మైలారం భిక్షపతి, ఉపసర్పంచ్ బాబు, బిల్లం మల్లారెడ్డి, బైగారి నాగరాజు, కంది మల్లారెడ్డి, కంది వెంకట్‌రెడ్డి, గొల్లపల్లి మైసగౌడ్ చవాన్ బాబు తో పాటు బీఆర్ఎస్ స్థానిక నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరుపేదకు ఉచితంగా కృత్రిమ కాలు

## ఆలయ ఫౌండేషన్ చొరవతో దుర్గం మారుతికి అండ

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 11 :**

హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన దుర్గం మారుతి ప్రమాదవశాత్తు కుడికాలు కోల్పోవడంతో కృత్రిమ కాలు అవసరమైంది. దీంతో ఆలయ ఫౌండేషన్ డిప్యూటీ సీఈఓ కీర్తి నాగార్జున , సభ్యులు అక్రంను సంప్రదించారు. ఆలయ ఫౌండేషన్ మార్గదర్శకులు పి. నరహరి ఐఏఎస్ చొరవతో హైదరాబాద్‌లోని భగవాన్ మహావీర్ ట్రస్ట్ సహకారంతో మారుతికి ఉచితంగా కృత్రిమ కాలు అమర్చారు. దీంతో ప్రమాదం కారణంగా కాలు కోల్పోయిన బాధితుడికి నడిచే అవకాశం లభించింది. ఈ సందర్భంగా దుర్గం మారుతి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ... ఆపదలో ఉన్న తమకు అండగా నిలిచి ఉచితంగా కృత్రిమ కాలు అందించిన ఆలయ ఫౌండేషన్ ప్రతి నిధులకు, పి. నరహరి ఐఏఎస్‌కు, భగవాన్ మహావీర్ ట్రస్ట్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఇలాంటి సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.

## వెంకటేశ్వర నగర్ లో ఘనంగా బోనాల ఉత్సవాలు



**కూకట్పల్లి, ఆగష్టు 11( నవజ్యోతి ప్రతినిధి )**

:వెంకటేశ్వర నగర్ కాలనీలో నిర్వహించిన బోనాల ఫలహారం బండి, తొట్టెల ఊరేగింపులో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు ఆషాఢ బోనాల శుభాకాంక్షలు తెలిపారు. బోనాల ఉత్సవాల కోసం సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా రూ. 20 కోట్లు కేటాయించారని, ఇందులో శేరిలింగంపల్లిలోని 92 ఆలయాలకు రూ. 30.71 లక్షలు మంజూరయ్యాయని గాంధీ వెల్లడించారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకైన ఈ పండుగను భక్తులు ప్రశాంతంగా జరుపుకునేలా తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అన్ని ఏర్పాట్లను ప్రభుత్వం పకడ్బందీగా చేసిందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు మరియు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ తో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

### పినపాక నియోజకవర్గ లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

**మణుగూరు.ఆగస్టు 11**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక నియోజకవర్గంలోని లబ్దిదారులకు రూ.4 లక్షల 15 వేల రూపాయల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) చెక్కులను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసాగా నిలుస్తుందని అన్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల మరియు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మదన పోచమ్మ ఆలయ స్లాబ్ నిర్మాణానికి శ్రీకారం

### కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన మనాలి రాజ్ ఠాకూర్

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 11 :**

రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, ఆయన సతీమణి, మక్కాన్ సింగ్ సేవా సమితి చైర్మన్ శ్రీమతి మనాలి రాజ్ ఠాకూర్ మంగళవారం మార్కండేయ కాలనీలోని రాజేష్ థియేటర్ సమీపంలో ఉన్న శ్రీ మదన పోచమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆలయ పైకప్పు నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం మనాలి రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ..... ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. మక్కాన్ సింగ్ సేవా సమితి ద్వారా అవసరమైన సహకారం అందించి ఆలయ నిర్మాణం పూర్తయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ట్రాఫిక్ సీఐ రాజేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతిపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్ సాగి సంతోష్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక మహిళలు, భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ లో 'ఆకాశరామన్న' ఫ్లెక్స్ .. లబ్దిదారులు ఎవరు!!!

- ఆరుగురు లబ్ధిదారులంటూ ప్రకటనలు.. పేర్లు ప్రకటించలేని దుస్థితి ఎందుకు!!
- సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 11 :**

రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ఎల్బీనగర్‌లో లబ్ధిదారుల పేర్లు వెల్లడించకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్స్‌పై సీపీఐ ఫ్లోర్ లీడర్, 41వ డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య ప్రశ్నలు సంధించారు. అసలు లబ్దిదారులు ఎవరో ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఎల్బీనగర్‌లో అసలైన లబ్ధిదారులం అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్స్‌లో లబ్ధిదారుల పేర్లు ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించారు. ఆరుగురు లబ్ధిదారులు ఉన్నారని నిన్నటి వరకు ప్రకటనలు చేసినప్పటికీ, నేడు కనీసం వారి పేర్లను కూడా ప్రకటించలేకపోవడం ప్రజాప్రతినిధి వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. అసలైన లబ్ధిదారులెవరో వెంటనే బహిరంగంగా ప్రకటించాలని రామగుండం ఎమ్మెల్యేను మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. లబ్ధిదారుల పేర్లు వెల్లడించలేని పరిస్థితి ఉంటే, ఎమ్మెల్యే గతంలో చేసిన డిమాండ్ మేరకు సీపీఐ ప్రకటించిన బాధితులందరికీ న్యాయం చేయాలని కోరారు. అసలైన లబ్ధిదారుల పేర్లు వెంటనే ప్రకటించాలి.. లేకపోతే బాధితులందరికీ న్యాయం చేయాలి అని మార్కపురి సూర్య డిమాండ్ చేశారు.

# జాతీయ నినాదాలతో మార్మోగిన రామాయంపేట..

- యువతలో దేశభక్తి స్ఫూర్తి
- 500 అడుగుల జాతీయ జెండాతో ఘనంగా తిరంగా యాత్ర
- యువతలో దేశభక్తి స్ఫూర్తి నింపిన తిరంగా యాత్ర
- దేశభక్తి నినాదాలతో హోరెత్తిన పట్టణం



**రామాయంపేట,ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ):**

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు బీజేపీ రామాయంపేట పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం భారీ తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ కళాశాల నుంచి ప్రారంభమైన యాత్ర ప్రధాన పురవీధుల మీదుగా కొనసాగింది. 800 విద్యార్థులు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని 500 అడుగుల భారీ జాతీయ జెండాను చేతబట్టి జాతీయ నినాదాలతో ముందుకు సాగారు. దీంతో రామాయంపేట పట్టణంలో దేశభక్తి వాతావరణం నెలకొంది. ర్యాలీలో పాల్గొన్న వారు 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' వంటి నినాదాలతో హోరెత్తించారు. సిద్దిపేట చౌరస్తాలోని స్వామి వివేకానంద విగ్రహానికి, అనంతరం రామాయంపేట చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ ఐక్యత, సమైక్యతను చాటుతూ యాత్ర కొనసాగింది.

**యువతే దేశానికి భవిష్యత్ బలం**

ఈ సందర్భంగా బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధామల్లేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా తిరంగా యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. యువత దేశానికి భవిష్యత్ బలమని, విద్యార్థులు దేశ చరిత్ర, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, రాజ్యాంగ విలువలను తెలుసుకోవాలని సూచించారు.

దేశభక్తి కేవలం జాతీయ పండుగలకే పరిమితం కాకుండా నిత్య జీవితంలో కనిపించాలని అన్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా జాతీయ సమైక్యత కోసం యువత ముందుకు రావాలని కోరారు. సోషల్ మీడియా ప్రభావానికి లోనుకాకుండా వాస్తవాలను తెలుసుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. విద్య, నైపుణ్యం, క్రమశిక్షణతో దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

జాతీయ జెండా దేశ స్వాతంత్ర్యం, త్యాగం, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రజా ఆస్తులను కాపాడటం, రాజ్యాంగాన్ని గౌరవించడం, సమాజ సేవలో పాల్గొనడం కూడా దేశభక్తిలో భాగమేనని తెలిపారు.

**భారీగా పాల్గొన్న బీజేపీ నాయకులు**

ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రంజిత్ మోహన్, మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కౌన్సిలర్ శంకర్ గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం కాశీనాథ్, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి చింతల శేఖర్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ఆకుల రమేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు మల్లిక, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మస్కూరి బాలరాజు, సిద్ధిరాములు, పంజా విజయ్, పబ్బ సత్యనారాయణ, భానుచందర్, గోపిశెట్టి అనంతలక్ష్మి , నవాత్ రాజు, దామోదర్, దేవేందర్, ఎల్లం దయానంద్, సంగయ్య, కన్నయ్య, లావణ్య, శేఖర్, రంగయ్య, చిన్నోళ్ల నాగరాజు, వినయ్, నితిన్, అనిల్, స్వామి,దిలీప్ కుమార్,సర్పంచులు ప్రవీణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, యువత భారీ జాతీయ జెండాతో క్రమశిక్షణగా నిర్వహించిన తిరంగా యాత్ర పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# రామాయంపేట వై జంక్షన్ మూసివేత పై బీజేపీ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం

- ప్రమాదాల నివారణకు వై జంక్షన్ మూసివేత
- ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

**రామాయంపేట,ఆగస్టు 11 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్) :**

రామాయంపేట పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారి వై జంక్షన్ వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో బీజేపీ నాయకులు మంగళవారం జంక్షన్‌ను తాత్కాలికంగా మూసివేశారు. రోడ్డు పక్కన ఉన్న డ్రమ్ములను తీసుకొచ్చి జంక్షన్‌కు అడ్డంగా ఏర్పాటు చేసి, వాహనాలు నేరుగా రామాయంపేట పట్టణంలోకి రాకుండా మెదక్ రోడ్డు వైపు మళ్లించేలా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా నాయకుడు పంజా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. వై జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. జంక్షన్ వద్ద వంతెన నిర్మాణానికి ఎంపీ రఘునందన్‌రావు సహకారంతో రూ.49 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. నిధులు మంజూరైనప్పటికీ పనులు చేపట్టడంలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు.





**బీజేపీ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం**

వై జంక్షన్ మూసివేత సందర్భంగా బీజేపీ నాయకులకు, పోలీసులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా జాతీయ రహదారిని మూసివేయడం సరికాదని సీఐ సైదా నాయక్ అభ్యంతరం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేస్తున్నారని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని బీజేపీ నాయకులు పట్టుబట్టారు.

# చెట్లు నరికారు.. రహదారి మూసుకుపోయింది!





- రాజీవ్ గృహకల్పలో బస్సు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు
- నరికిన కొమ్మలు తొలగించకపోవడంతో రాకపోకలకు అంతరాయం

**కీసర , ఆగస్టు 11,(నవజ్యోతి ప్రతినిధి) :**

కీసర సర్కిల్ పరిధిలోని దమ్మాయిగూడ డివిజన్ రాజీవ్ గృహకల్పలో విద్యుత్ శాఖ సిబ్బంది చెట్ల కొమ్మలను నరికిన అనంతరం వాటిని తొలగించకుండా రహదారిపైనే వదిలేయడంతో బస్సు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చెట్ల కొమ్మలు రహదారిపై పేరుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి బస్సులు వెళ్లేందుకు ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. దీంతో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రధానంగా రహదారి ఇరుకుగా మారడంతో బస్సులు, ఇతర వాహనాలు ఒకేసారి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రద్దీ సమయాల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. "చెట్లు నరికారు.. కొమ్మలు తొలగించడం మరిచారు!" విద్యుత్ పనులు పూర్తయిన వెంటనే నరికిన కొమ్మలను తొలగించి రహదారిని శుభ్రం చేయాల్సి ఉన్నప్పటికీ, వాటిని అలాగే వదిలేయడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రజల రాకపోకలు, ముఖ్యంగా బస్సు ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, రహదారిపై ఉన్న చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులను స్థానికులు కోరుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి రహదారిని క్లియర్ చేసి బస్సులు, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

Printed, Published, Owned by MANNE LAXMAN Printed at Saketh Publications, 312, Trinetra Complex, Sangareddy, Telangana 502001 Published from SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001 P.H: 9908123780, Email:navajyothinews@gmail.com, RNI no. TGTEL/25/A2372, EDITOR: MANNE LAXMAN